జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజలకోసం

కరీంనగర్

జగిత్యాల - రాజన్న సిరిసిల్ల - పెద్దపల్లి

ఆదివారం, మార్చి 17, 2024 పేజీలు : 11

## మహిళలు,యువతులు ధైర్యంగా ముందుకు వస్తేనే వేధింపుల నుండి బయటపడగలరు

- గంజాయి లాంటి మతుపదార్థాలను తరమి కొట్టడంలో ప్రతి ఒక్క విద్యార్థి భాగస్వామ్యం కావాలి.
- యాంటీ డ్రగ్ క్లబ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహమతులు అందజేత.
- ఎస్పీ అఖిల్ మహాజన్



2లో..



## సమన్వయంతో విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- ప్రతిరోజు కొంత సమయం ఇంటి వద్ద పిల్లలను తప్పనిసరిగా చదివించాలి
- వంద శాతం విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యేలా చూడాలి
- తొలిమెట్టు ద్వారా ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి
- ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా 10వ తరగతి పరీక్షలు రాయాలి
- అమర్ నగర్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో పేరెంట్, టీచర్స్ సమావేశం, పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో కలెక్టర్

పెద్దపల్లి ప్రతినిధి,(ప్రజా జ్యోతి), మార్చి 16: విద్యార్థుల తల్లి దండ్రులు, పాఠశాలలోని ఉపాధ్యాయులు సమన్వయంతో పని చేస్తే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పెద్దపల్లి అమర్ నగర్ లోని మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్స్ మీటింగ్, పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, విద్యార్థులకు మంచి భవిష్యత్తు అందించడం మిగతా 2లో..

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి



- జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి
- ప్రవర్తన నియమావళిని తూచా తప్పకుండా పాటించాలి
- ఫిర్యాదులకు 24 గంటలు 1950 టోల్ ఫ్రీ కాల్ సెంటర్ ఏర్పాటు
- సి విజిల్ యాప్ ద్వారా ఉల్లంఘనలపై ఫిర్యాదు చేయవచ్చు
- పాత్రికేయులతో జిల్లా కలెక్టర్ ప్రెస్ మీట్

రాజన్న సిరిసిల్ల, మార్చి 16, (ప్రజా జ్యోతి): భారత ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం సాధారణ పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి జయంతి కోరారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా ఎన్నికల అధికారి అనురాగ్ జయంతి, ఎస్పీ అఖీల్ మహాజన్ లతో కలిసి జిల్లాలో సాధారణ ఎన్నికల నిర్వహణపై ప్రెస్ మీట్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేసిందని, ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ ఏప్రిల్ 18న వస్తుందని, ఏప్రిల్ 18 నుంచి ఏప్రిల్ 25 తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, ఏప్రిల్ 26 వరకు నామినేషన్ల స్క్రూటినీ, ఏప్రిల్ 29 వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ఉంటుందని, మే 13న పోలింగ్, జూన్ 4 న కౌంటింగ్ నిర్వహణ జరుగుతుందని అన్నారు. రాజన్న సిరిసిల్ల మిగతా 2లో..

## ఎన్నికల్లో డబ్బులు పంచాలని బీఆర్ఎస్ యోచన



- కరీంనగర్ ప్రతిమ మల్టీప్లెక్స్ లో దొరికిన 6.57 కోట్లు ఎవరివి
- ప్రతిమ కేసీఆర్ అత్యంత సన్నిహితుడు వినోద్ కుమార్ దే
- కవిత అరెస్ట్ తో బీజేపీ, బీఆర్ఎస్ డ్రామా
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, మార్చి 16, (ప్రజాజ్యోతి): వేములవాడ పట్టణంలో శనివారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గత తొమ్మిదిన్నర సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దోచుకున్న డబ్బుతో గెలవాలని చూస్తుందని, దానికి నిదర్శనమే కరీంనగర్లోని ప్రతిమ మల్టీప్లెక్స్ లో దొరికిన 6 కోట్ల 67 లక్షలని ఆది శ్రీనివాస్ అన్నారు. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగా మేం చేస్తున్న ఆరోపణలను నిజం చేస్తూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ రాకముందే బీఆర్ఎస్ పార్టీకి ప్రజా ప్రతినిధికిచెందిన డబ్బు పట్టుబడడం దానికి నిదర్శనం అన్నారు. కరీంనగర్ ప్రతిమ మల్టిప్లెక్స్ లో దొరికిన 6 కోట్ల 67 లక్షల డబ్బు ఎవరివివని ప్రశ్నించారు. ఎన్నికలు షెడ్యూల్ రాకముందే విచ్చల విడిగా డబ్బుల పంపిణీచేసేందుకు బిఆర్ఎస్ నేతలు ప్లాన్ చేస్తున్నారని మిగతా 2లో..




మిగతా 2లో..

### ఎన్నికల్లో డబ్బులు పంచాలని
# బీఆర్ఎస్ యోచన

మొదటిపేజీ తరువాయి..

ఆరోపించారు. కరీంనగర్ లో ఆర్టీసి స్థలం ను లీజు కు తీసుకొని ప్రతిమ మల్టిప్లెక్సీ కట్టారని అవి ఎవరివో అందరికీ తెలుసన్నారు. మల్టీప్లెక్స్ లోని సెల్లార్లో ఆయిల్ కటన్డబ్బాల్లో డబ్బులను ప్యాక్ చేశారని కాలేశ్వరంలో దోచుకున్న డబ్బుతో గెలువలని చూస్తున్నారని, కాలేశ్వరం ప్రాజెక్టును మా కామదేనుగా మార్చుకున్నారు అన్నారు. గత ఎన్నికలలో ప్రజలు బీఅర్ఎస్ కి కర్రు కాల్చి వాత పెట్టారని, కానీ మళ్ళీ తొమ్మిదిన్నర ఏళ్లలో సంపాదించినా డబ్బులు పంచి మళ్ళీ గెలవాలని చూస్తుందన్నారు. బిఅర్ఎస్ నేతలు ఎన్ని కుట్రాలు చేసిన ప్రజలు తిరస్కరిస్తారని, రాష్ట్రం లో బిఅర్ఎస్ కాలం చెల్లిందని అందులో మిగిలేది కేసీఅర్, కెటిఆర్, హరీష్, కవిత మాత్రమే అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బతుకమ్మను కవిత నే కనిపెట్టినట్లు చేస్తుందని, అధికారంలో ఉన్నపుడు జ్యోతి రావు పూలే, అంబేద్కర్ జయంతి,వర్ధంతిలకు కెసిఆర్ ఏనాడు కూడా పూల మాలాలు వేయలేదని అన్నారు. అంబేద్కర్ జయంతికి పూల మాల వెయ్యని వారు అసెంబ్లీలో జ్యోతి రావు పూలే విగ్రహం పెట్టామనడం విడ్డురంగా ఉందని, వారి పెరితో రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఓ మహిళ అయి ఉండి మద్యం కుంభ కోణంలో ఇరుక్కోవడం సిగ్గు చేటున్నారు. బీజేపీ, బిఅర్ఎస్ ఒక్కటి కాదని చెప్పడానికి మాత్రమే నిన్నటి రోజున కవిత అరెస్ట్ డ్రామా అనీ అన్నారు. లోక్ సభ ఎన్నికల కోసమే బీజేపీ, బిఅర్ఎస్ డ్రామాలని, బీజేపీ, బిఅర్ఎస్ డ్రామాలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. కవిత అరెస్ట్ అనేది గత ఏడాది అక్టోబర్ కావాల్సి ఉండేదని, బీజేపీ, బిఅర్ఎస్ ఒక్కటే అని ప్రజలు అనుకుంటున్నారని గతంలో బీజేపీ నేతలే ఆరోపించారు అన్నారు. బిఅర్ఎస్ తో తమకు మిలాకత్ లేదు అని చెప్పడానికే బీజేపీ కవితను అరెస్ట్ చేసిందని, బీజేపీ, బిఅర్ఎస్ ఎన్ని డ్రామాలు చేసిన ప్రజలు నమ్మే పరిస్థితిలోలేరన్నారు. రాష్ట్ర ప్రజయోజనాల పైన బీఅర్ఎస్ కి ఏ మాత్రం చిత్త శుద్ధి లేదని, గతంలో ప్రధానిని కలిసిన కేసీఅర్ సాధించింది ఎం లేదని, కేవలం కెటిఆర్, కవితల కేసుల మాఫీ కోసమే మోడీని కేసీఅర్ కలిశారని, కానీ ప్రజల సంక్షేమం కోసం కాదన్నారు. తెలంగాణ రాష్ట్రన్ని దోచుకొని పక్క రాష్టాల్లో పార్టీ ఆఫీస్ లు పెట్టారని, ఇక్కడి రైతులు చనిపోతే వారిని పట్టించుకోకుండా పక్కా రాష్ట్రాల్లోని రైతులకు డబ్బును పంచిపెట్టారన్నారు. మతం పేరిట రాజకీయం చేస్తుందని, దేశంలో నరేంద్ర మోడీ కాల పరిమితి ముగిసిందని అన్నారు. కన్యాకుమారి నుండి కాశ్మీర్ వరకు ప్రజలు కాంగ్రెస్ ని కోరుకుంటున్నారని, తెలంగాణ రాష్ట్రంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లోతెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను గెలుస్తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కువ స్థానాలు కాంగ్రెస్ కి వస్తాయని ఇప్పటికే సర్వేలు స్పష్టం చేసాయన్నారు.

# సమన్వయంతో విద్యార్థులపై శ్రద్ధ వహించాలి

మొదటిపేజీ తరువాయి..

కోసం ఉపాధ్యాయులు నిరంతరాయంగా కృషి చేస్తున్నారని, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు కలిసి 5 అంశాలలో పనిచేస్తే విద్యార్థి భవిష్యత్తుకు మంచి బాటలు వేయగలుగుతామని కలెక్టర్ తెలిపారు. తల్లిదండ్రులు ముందస్తుగా తప్పనిసరిగా విద్యార్థులను పాఠశాలలకు పంపాలని, వంద శాతం విద్యార్థులు హాజరు ఉండేలా చూడాలని కలెక్టర్ కోరారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో టిఎల్ఎం ద్వారా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన చేస్తున్నామని, ప్రతి విద్యార్థికి పాఠ్యాంశాలు అర్థమయ్యే విధంగా అదనపు శ్రద్ధ చూపించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులతో పాటు పాఠశాలకు సకాలంలో ఉపాధ్యాయులు హాజరయ్యే విధంగా చర్యలు చేపట్టామని, తొలిమెట్టు కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని, బేసిక్ గణితం, తెలుగు, హిందీ, ఆంగ్ల భాషలలో రాయడం, చదవడం ప్రతి విద్యార్థికి రావాలనీ చర్యలు చేపట్టామని అన్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులుతీసుకుంటున్న శ్రద్ధతోపాటు ఇంటి వద్ద కూడా తల్లిదండ్రులు విద్యార్థులపై శ్రద్ధ చూపించాలని, పాఠశాలలో ఏం నేర్చుకుంటున్నారో ప్రతి రోజూ ఇంటి వద్ద తల్లిదండ్రులు పరిశీలించాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థి వద్ద డైరీ ఏర్పాటు



చేస్తామని, ఇంటి వద్ద విద్యార్థులు చదవాల్సిన పాఠ్యాంశాల వివరాలు సదరు డైరీలో నమోదు చేస్తామని, తల్లిదండ్రులు తప్పనిసరిగా ఇంటి వద్ద విద్యార్థులచే కొంత సమయం చదివించి హోమ్ వర్క్ పూర్తి చేయించాలని అన్నారు. పాఠశాలలో నిర్వహించే పేరెంట్ టీచర్స్ మీటింగ్ లకు తల్లిదండ్రులు రెగ్యులర్ గా హాజరుకావాలని, ప్రతి సబ్జెక్టులో తమ పిల్లల పురోగతి వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లల ఆరోగ్యంపై సైతం తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని వారికి గుడ్లు, పప్పు వంటి పౌష్టికాహారం అందించాలని, ఇంట్లో మగ, ఆడపిల్లలను సమానంగా చూడాలని కలెక్టర్ సూచించారు. రాబోయే వేసవి సెలవులలో పిల్లలకు చదివే, రాసే అలవాటు చేయాలనీ, తప్పకుండా ప్రతిరోజు ఇంటి వద్ద కొంత సమయం చదువుకునేలా తల్లిదండ్రులు పర్యవేక్షించాలని కలెక్టర్ కోరారు. అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులతో ముచ్చటించారు. మార్చి 18 నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభం అవుతున్నాయని, అందుబాటులో ఉన్న రెండు రోజుల సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఓల్డ్ ప్రశ్నాపత్రాలను పరిశీలించి ముఖ్యమైన పాఠ్యాంశాలను పునరావృతం చేసుకోవాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంత మనసుతో పరీక్షలకు హాజరుకావాలని, ఒక రోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను పరిశీలించుకోవాలని, అనవసరపు ఆందోళనలకు గురైతే మనం చదివిన పాఠ్యాంశాలు సైతం మర్చిపోయే అవకాశం ఉంటుందని, పరీక్షల సమయంలో మనం ఎంత ప్రశాంతంగా ఉంటే అంత మంచిగా పరీక్షలు రాసే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట పాఠశాల అకాడమిక్ మానిటరింగ్ అధికారి డాక్టర్ పిఎం షేక్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజులత, ఎం.ఈ.ఓ. సురేందర్ కుమార్, ప్రత్యేక అధికారి వై. తిరుపతి రావు ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు..

### మహిళలు,యువతులు ధైర్యంగా ముందుకు వస్తేనే
# వేధింపుల నుండి బయటపడగలరు

సిరిసిల్ల టౌన్: మార్చి 16(ప్రజా జ్యోతి) సిరిసిల్ల పట్టణంలో నర్సింగ్ కాలేజి ఆవరణలో శనివారం విద్యార్థిని విద్యార్థులకు ఉమెన్ సేఫ్టీ,మహిళల రక్షణ చట్టాల గురించి, ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ యాంటీ హ్యుమెన్ ట్రాఫికింగ్ లపై ,సోషల్ మీడియా, సైబర్ నేరాలు, గంజాయిలపై ఏర్పటు చేసిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు,విద్యార్థినులు వేధింపుల నుండి బయట పడేందుకు దైర్యంగా ముందుకు వెళ్ళడమే మార్గామని,విద్యార్థినిలు పోకిరీల పట్ల జాగ్రత్తగా ఉండాలని, వేదింపులకు సంబందించి ఏదైనా చిన్న సంఘటన జరిగిన వెంటనే ఇంట్లో తల్లిదండ్రులకు గానీ, టీచర్స్ కు గానీ తెలియజేయాలని, ఎవరైనా తమ పట్ల చిన్న తప్పు చేసేందుకు ప్రయత్నిస్తున్న ముందుగానే గుర్తించి అలాంటి వారిని దూరంగా ఉంచాలన్నారు.జిల్లాలో మహిళలు, బాలికలపై జరుగుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన షీ టీమ్ విద్యా సంస్థలు, బస్టాండ్ లు, మహిళలు పని చేసే ప్రాంతాల్లో, బహిరంగ ప్రదేశాల్లో మఫ్టీలో డ్రెస్ లలో నిరంతరం పోకిరీలపై నిఘా ఉంచుతూ మహిళా చట్టాలపై వివిధ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు.విద్యార్థులు సోషల్ మీడియా కి దూరంగా ఉండాలని, సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులు పంపే సందేశాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100, జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 కు పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యాలు తీసుకోవడం జరుగుతుంది అని అన్నారు.మాధకద్రవ్యాల నిర్ములానే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని అందులో భాగంగా జిల్లాలో విద్యార్థులు, ఉ పాధ్యాయుల భాగస్వామ్యం తో యాంటీ డ్రగ్ క్లబ్స్ ఏర్పటు చేసి జిల్లాలోని అన్ని పాఠశాలలో, కళాశాలలో ఏర్పటు చేసిన చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు కేటగిరి వారిగా నిర్వహించి అందులో గెలుపొందిన 96 మంది విద్యార్థులకి మండలల వారిగా బహమతులు ప్రధానం చేసి ప్రస్తుతం యువత గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసలై తమ అమూల్యమైన భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అలాంటి మత్తు పదార్థాలను దూరం కొట్టడంతో ప్రతి ఒక విద్యార్థి భాగస్వామ్యం కావాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ రఘుపతి, షీ టీం ఏ. ఎస్.ఐ ప్రమీల సిబ్బంది ప్రియాంక, రమదేవి,శ్రీధర్, భరోసా సెంటర్ సిబ్బంది ,కళాశాల, పాఠశాల సిబ్బంది ,విద్యార్థులు ఉన్నారు.

# ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

మొదటిపేజీ తరువాయి..

జిల్లాలో ఓటరు జాబితా సవరణ తుది ఓటరు జాబితా ప్రకారం 4 లక్షల 70 వేల 634 మంది ఓటర్లు, 160 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్ జాబితాలో తమ పేరు సరి చూసుకోవాలని, జాబితాలో పేరు లేని వారు ఏప్రిల్ 15 వరకు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఓటర్ కు రెండు కిలోమీటర్ల రేడియస్ లో పోలింగ్ కేంద్రాలు ఉండేలా చర్యలు తీసుకున్నామని, అవసరమైన మేర బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఎన్నికల కమిషన్ సాధారణ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నాటి నుండి జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి వర్తిస్తుందని అన్నారు. మతం, కులం, ప్రాంతంపై విద్వేషాలు పెంచే విధంగా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు సమావేశాలు నిర్వహించు కునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు. రాజకీయ సమావేశాలు ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాలల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో నిర్వహించరాదని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎం.సి.సి., సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎం.సీ.ఎం.సీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను ప్రజలు 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజల్ యాప్ ద్వారా చేయవచ్చని అన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్లో ఫిర్యాదుల స్వీకరించేందుకు 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని, సి – విజల్ యాప్ లో లైవ్ వీడియో అప్ లోడ్ చేసిన 100 నిమిషాల గడువులోపు అధికారులు క్షేత్రస్థాయిలో చేరుకొని ఫిర్యాదు పై చర్యలు తీసుకుంటారని అన్నారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు,ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ మొదలైన పబ్లిక్ ప్లేస్ లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదేవిధంగా ఎవరు ప్రింట్ చేయమన్నారు వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని , ఈ అంశాన్ని అన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులకు సమాచారం అందించామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, వీటిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, భారత ఎన్నికల కమిషన్ ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తెలంగాణలో నాలుగో విడతలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు. అక్రమ నగదు, లిక్కర్ సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాలో అవసరమైన మేర 7 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని, 24 గంటలపాటు గట్టి నిఘా ఉంచామని తెలిపారు. ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఎన్నికల దృష్ట్యా ప్రజలు ఆధారాలు లేకుండా 50 వేలకు మించి నగదు తో ప్రయాణించవద్దని, ప్రతిరోజు తనిఖీలలో జప్తు చేసిన సొమ్మును జిల్లా లో ఏర్పాటు చేసే గ్రీవెన్స్ కమిటీకి అప్పగిస్తామని, ఆధారాలు సమర్పించి గ్రీవెన్స్ కమిటీ నగదు విడుదల చేస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డిపిఅర్ఓ వి శ్రీధర్, పాత్రికేయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పోషణ పక్షం-ఆరోగ్య లక్ష్యం

కొడిమ్యాల,మార్చి 16,(ప్రజాజ్యోతి):మండలంలోని నాచుపల్లి గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా బాలింతలు,గర్భిణి మహిళలచే ప్రతిజ్ఞ చేయించారు.ముఖ్యఅతిథిగా ఐసిడిఎస్ సూపర్వైజర్ ఉమ హాజరై మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన ఆహారాన్ని గర్భిణీ స్త్రీలు, బాలింతలు తప్పనిసరిగా తీసుకోవాలని,చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన పోషకాలు లభిస్తాయని తద్వారా పుట్టబోయే బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు.ఈ సందర్భంగా పిల్లలకి విద్యా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి,పోషకాహారం వల్ల పిల్లల మానసిక,శారీరక అభివృద్ధి ఎలా వృద్ధి చెందుతుందో వివరించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అర్చన,రాంబాయి,సుజాత, జమునాభి,పాఠశాల ఉపాధ్యాయులు,ఆశా వర్కర్లు, బాలింతలు,పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రేస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు



బీరుపూర్, మార్చి 16 (ప్రజాజ్యోతి): సారంగాపూర్ మండల్ బట్టపల్లి మాజీ సర్పంచు ఆరే లక్ష్మీ ప్రేమ్ నందు మాజీ ఉప సర్పంచులు బీరుపూర్ మండలం రేకులపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మాజీ వార్డ్ మెంబర్లు సుమారు 40 మంది ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీరుపూర్ ఎంపీపీ మసర్తి రమేష్, వైస్ ఎంపీపీ బలుమురి లక్ష్మణ్ రావు మండలాలకు చెందిన కాంగ్రెస్ నేతలు వారి వెంట ఉన్నారు.

# రాజకీయ కుట్రలో బాగమే ఎమ్మెల్సీ కవితక్క అరెస్ట్

**ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ మంథనిలో బిఆర్ఎస్ పార్టీ ధర్నా**

మంథని,మార్చి 16 (ప్రజా జ్యోతి) పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అవుతున్న నేపద్యంలో కాంగ్రెస్ బీజేపీల కుట్రలో బాగమే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. మాజీ ఎంపీ, ఎమ్మెల్సీ కవిత ను ఈడీ అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ పెద్దపల్లి జెడ్పీ చైర్మన్, మంథని నియోజకవర్గ భీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ పుట్ట మధూకర్ ఆదేశాల మేరకు శనివారం మంథని పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు నిరసన చేపట్టారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై కాంగ్రెస్, బీజేపీలు కక్ష్యసాధింపు చర్యలకు పాల్పడుతున్నాయని,ఈ క్రమంలో ముందస్తు సమాచారం లేకుండా ఆడబిడ్డను, మహిళా ప్రజాప్రతినిధి అని చూడకుండా అరెస్ట్ చేయడం అప్రజాస్వామికమన్నారు. కవిత అరెస్టును నిరసిస్తూ ఉద్యమాలు చేస్తామని, కాంగ్రెస్, బీజేపీల నియంత పోకడలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని వారు పిలుపునిచ్చారు.



# ఆరు నెలల్లో యావర్ రోడ్డును 100 ఫీట్లు విస్తరిస్తాం

**త్రాగునీటి సరఫరా వేళలు ప్రజలకు తెలియజేయాలి**

**పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి**



జగిత్యాల టౌన్, మార్చి 16 (ప్రజాజ్యోతి): జగిత్యాల మున్సిపల్ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతిలక్ష్మణ్ ను ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అభినందించారు.1994 ఎన్నికల కన్నా ముందు అందరిని ఒప్పించి ఎటువంటి పరిహారం చెల్లించకుండ పరస్పర ఒప్పందంతో 40 ఫీట్ల యావర్ రోడ్డును 60 ఫీట్లకు విస్తరించామని గుర్తు చేశారు. 2014 తర్వాత 60 ఫీట్ల రోడ్డును 100 ఫీట్లు విస్తరించాలని తీర్మానం చేసినా ప్రభుత్వం ఆమోదం తెలిపేందుకు ఐదేళ్లు నాన్చిందన్నారు. రోడ్డు విస్తరణకు ఆమోదం తెలిపిన తర్వాత విస్తరణ కేవలం ప్రభుత్వ కార్యాలయాలకే పరిమితమైందని అన్నారు. రోడ్డు విస్తరణలో చెల్లించాల్సిన పరిహారం చెల్లించకపోవడంతో విస్తరణ పనులు మూలన పడ్డాయని తెలిపారు. యాపర్ రోడ్డు విస్తరణలో ఎంత మొత్తం పరిహారం చెల్లించాల్సి వస్తుందో మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు అంచనాలు రూపొందించారని అన్నారు. యావర్ రోడ్డు విస్తరణకు అవసరమైతే రూ.100 కోట్లయినా కేటాయిస్తామన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లోపు ఆరు నెలల్లో యావర్ రోడ్డు 100 ఫీట్ల విస్తరణ చేపడుతామన్నారు. ఎమ్మెల్సీ పదవి కాలం మరో ఏడాది ఉన్నదని పదవి కాలం ముగిసేలోపు సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెల్లి 100 కోట్ల నిధులు కేటాయింప చేస్తామన్నారు. జగిత్యాల పట్టణ మున్సిపల్ చైర్పర్సన్ పదవి బలహీనవర్గాల మహిళకు కేటాయించిన స్థానాన్ని సంవత్సరకాలం నుండి భర్తీ చేయకుండ చట్టం లొసుగు నెపంలో రాజ్యాంగ బద్దంగా బలహీన వర్గాల మహిళకు కేటాయించబడిన చైర్పర్సన్ పదవి స్థానాన్ని ఇతర వర్గాలకు కేటాయించి మహిళల పట్ల వివక్ష చూపారన్నారు. ఏడాది కాలంగా మున్సిపల్ పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. పాలనను గాడిలో పెట్టాల్సిన బాధ్యత నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి పై ఉందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో జగిత్యాల మున్సిపాలిటీ ప్రత్యేకత గుర్తింపు పొందిందని త్రాగునీటి సమస్య తలెత్తకుండ ప్రతి రోజు త్రాగునీరు సరఫరా చేశామన్నారు. వేసవి కాలం దృష్టా నిత్యం త్రాగు నీరు సరఫరా సమయం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వార్డుల వారీగా త్రాగునీటి సరఫరా వేళలు వెల్లడించాలన్నారు. త్రాగునీరు సరఫరాలో అంతరాయం లేకుండ ప్రజాప్రతినిధులు బాధ్యత తీసుకోవాలని మున్సిపల్ పాలక మండలి మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు పరిష్కరించాలని జీవన్ రెడ్డి సూచించారు.

# మున్నూరు కాపు సంఘం పెద్దపల్లి జిల్లా కన్వీనర్ గా ఇనుముల సతీష్



మంథని, మార్చి 16 (ప్రజా జ్యోతి) పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం మహాసభ జిల్లా కన్వీనర్ గా ఇనుముల సతీష్ మున్నూరు ను నియమిస్తున్నట్లు తెలంగాణా రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ రాష్ట్ర అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర రావు మున్నూరు తెలిపారు.ఈమేరకు శుక్రవారం రాత్రి హైదరాబాద్ లోని కాచిగూడ లో గల తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ కార్యాలయంలో పలువురు కుల భాందవుల సమక్షంలో ఇనుముల సతీష్ కు నియామకపు లేఖను అందించారు.ఈ సందర్భంగా రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గత 30 ఏండ్లుగా మంథని ప్రాంతంలో మున్నూరు కాపు సంఘం కోసం అనేక కార్ర్యమాలను నిర్వహించి,మున్నూరు కాపు యువకమండలిలో చురుకుగా వ్యవహరించి కాపు కుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తున్న సేవలను గుర్తించి ఇనుముల సతీష్ మున్నూరును పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం కన్వీనర్ గా నియమించామని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో మున్నూరు కాపు సంఘాల ఏర్పాటుతో పాటు,13 మండలాల్లో నూతన కమిటీలు ఏర్పాటు చేస్తూ,వాటిని బలోపేతం చేస్తూ కుల సోదరుల ఐక్యతకు కృషి చేయాలని,ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మున్నూరు కాపు కార్పొరేషన్ ఫలాలను గ్రామీణ స్థాయిలో ఉన్న మున్నూరు కాపు రైతు సోదరులకు అందే విధంగా శ్రమించాలని వారు కోరారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా కన్వీనర్ ఇనుముల సతీష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా కన్వీనర్ గా నియమించిన రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర రావు కు,ఇతర రాష్ట్ర కార్యవర్గానికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.అదేవిధంగా గత ప్రభుత్వంలో మొట్ట మొదటి సారిగా రాష్ట్ర అసెంబ్లీలో మున్నూరు కాపు కుల సోదరుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసిన మేరకు ఆతర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో కమిటీ చైర్మన్ గా ఈ అంశాన్ని చేర్చినప్పటి నుండి మొన్నటి క్యాబినెట్ ఆమోదం దాకా తీవ్రంగా కృషి చేసిన రాష్ట్ర ఐ.టి. శాఖా మంత్రివర్యులు, మంథని శాసన సభ్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబు కు పెద్దపల్లి జిల్లా మున్నూరు కాపు కుల సోదరుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియ చేస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రికి,ఇతర మంత్రివర్గ సభ్యులకు కూడా హృదయ పూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షులు మణికొండ వెంకటేశ్వర రావు, కార్యదర్శి కొంతం సురేష్ బాబు , మహాసభ మ్యారేజ్ బ్యూరో కన్వీనర్ కొమ్ము శ్రీనివాస్,కొరివి వేణుగోపాల్, అయిలి శ్రీనివాస్, మంగు ఆనంద్ కుమార్ , కందికట్ల భాస్కర్, కంచుకట్ల ప్రకాష్, అనాసి కృష్ణారావు , భాషెట్టి దయానంద్ , అనంతుల ప్రహ్లాద్, చలిమెల రమేష్ కుమార్ ,చలిమెల శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు వెడల్పులో భారీ కుట్ర

**సింగరేణి తో కుమ్మక్కైన కొన్ని కార్మిక సంఘాలు**

**క్వార్టర్ల ను కూల్చి వేస్తే ఊరుకోం**

**సి ఎం దృష్టికి తీసుకెళ్తాం**

**హెచ్ ఎం ఎస్ రాష్ట్ర అధ్యక్షులు రియాజ్**



గోదావరిఖని, మార్చి 16 (ప్రజా జ్యోతి) గోదావరిఖని అంగడి బజార్ నుంచి రోడ్డు వెడల్పు కార్యక్రమం లో భారీ కుట్ర దాగి ఉందని సింగరేణి మైనర్స్ అండ్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ (హెచ్ ఎం ఎస్) రాష్ట్ర అధ్యక్షులు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు వెడల్పు కార్యక్రమం రెండువైపులా కాకుండా ఒక వైపు చేపట్టడం లో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. భాస్కర్ రావు భవన్ ఉందని ఒకవైపు చేయడం సరికాదన్నారు.అభివృద్ధిని తాము వ్యతిరేకించబోమని, ఈ క్రమంలో కార్మికులకు అన్యాయం జరిగితే ఊరుకునేది లేదని రియాజ్ హెచ్చరించారు. రోడ్డు వెడల్పు పేరుతో సింగరేణి క్వార్టర్లను కూల్చివేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టడానికి యాజమాన్యం యోచిస్తుందని ఈ విషయం లో కొన్ని కార్మిక సంఘాలు యాజమాన్యంతో కుమ్మక్కయ్యాయని విమర్శించారు. ఒకవైపు 40 ఫీట్లు కాకుండా ఇరువైపులా 10 ఫీట్ల రోడ్డు సరిపోతుందన్నారు.15రోజులలో క్వార్టర్లను ఖాళీ చేయాలని నోటీసు ఇవ్వడం సరికాదన్నారు. భాస్కర్ రావు భవన్ ఉందనే సాకుతో అంగడి బజార్ బజార్ స్కూల్ నుంచి రోడ్డు వేయడం ఎంతవరకు సమంజసం అని రియాజ్ ప్రశ్నించారు. సింగరేణి యాజమాన్యానికి గాని కార్పొరేషన్ కు గాని చిత్తశుద్ధి ఉంటే ఆర్ సి ఓ ఏ క్లబ్ తీన్ రాస్తా నుంచి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈ రోడ్డు వెడల్పు పై తాము బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. రోడ్డు వెడల్పు పేరుతో 72 కార్మిక కుటుంబాలకు అన్యాయం చేయాలని చూస్తే తాము ఊరుకునేది లేదని తీవ్రంగా అడ్డుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా యాజమాన్యం గాని కార్పొరేషన్ గాని నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో తాము ప్రజాస్వామ్యయుతంగా ఆందోళనలను చేపడతామని ,అవసరమైతే కార్మిక కుటుంబాలను తీసుకొని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ రోడ్డు వెడల్పు కార్యక్రమానికి చట్టబద్ధత ఉందా అని హెచ్ ఎం ఎస్ నాయకులు తోట వేణు ప్రశ్నించారు. ఇప్పటికే బొందల గడ్డ అయిన ఈ ప్రాంతాన్ని నామరూపాలు లేకుండా చేయాలని దురాలోచనతో పాలకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే ఇక్కడి నుంచి చాలామంది ప్రజలు వలస వెళ్లారని ఇప్పుడు అకస్మాత్తుగా అభివృద్ధి పేరుతో కార్మిక కుటుంబాలకు అన్యాయం చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు.

# మార్కెట్ డిమాండ్ అనుగుణంగా నైపుణ్యాలను అప్ డేట్ చేసుకోవాలి

**కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**టాస్క్ సెంటర్ ను యువత వినియోగించుకొని తమ నైపుణ్యాలను పెంచుకోవాలి**
**యువత లక్ష్యాల సాధనకు ప్రభుత్వం సంపూర్ణ సహకారం**
**టాస్క్ నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**





పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి), మార్చి –16: మన కెరియర్ లో ఉన్నత స్థాయికి చేరుకోవాలంటే మార్కెట్ డిమాండ్ ప్రకారం ఎప్పటికప్పుడు మన నైపుణ్యాలను అప్ డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పెద్దపల్లి పట్టణంలోనీ ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఉన్న జిల్లా సమాఖ్య భవనంలో నూతనంగా ఏర్పాటు చేసిన టాస్క్ నైపుణ్య శిక్షణా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, ప్రస్తుతం విద్యార్థులకు విద్యార్హతలతో పాటు ఇతర నైపుణ్యాలు ఉంటే ఉపాధి లభిస్తుందని, మార్కెట్ లో వివిధ కంపెనీలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులకు ముందస్తుగా అందించి ఉద్యోగ నిర్వహణకు వారిని సన్నద్ధం చేసేందుకు నైపుణ్య శిక్షణా కేంద్రాలు ఉపయోగపడతాయని అన్నారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాల మేరకు పెద్దపల్లి జిల్లాలో టాస్క్ నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభించామని, జూన్ మాసంలో కంపెనీలు ఉపాధి డ్రైవ్ చేపడతాయని, అంతకంటే ముందు ఒక బ్యాచ్ కు శిక్షణ అందించి వారిని సన్నద్ధం చేసేందుకు టాస్క్ సెంటర్ త్వరగా ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. టాస్క్ నైపుణ్య శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని, టాస్క్ సెంటర్ ద్వారా విద్యార్థులకు 110 కు పైగా వివిధ రకాల కోర్సులలో శిక్షణ అందించడం జరుగుతుందని, ఈ అవకాశాలను యువత వినియోగించుకొని జీవితంలో ఎదగాలని కలెక్టర్ ఆకాంక్షించారు. మన జీవితంలో ఆశించిన లక్ష్యాన్ని సాధించేందుకు మన నైపుణ్యాలను ఎప్పటి కప్పుడు అప్ డేట్ చేసుకోవాలని, నూతన అంశాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. యువత నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు సంపూర్ణ సహకారం అందిస్తామని, వారికి అవసరమైన గైడెన్స్, నైపుణ్య శిక్షణను టాస్క్ సెంటర్ అందిస్తుందని అన్నారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ, యువత భవిష్యత్తుకు భరోసా కల్పించడానికి టాస్క్ నైపుణ్య శిక్షణ కేంద్రం ఉపయోగపడుతుంద ని, ఉద్యోగం కోసమే కాకుండా చిన్న, చిన్న వ్యాపారాలు ప్రారంభించడం కోసం అవసరమైన గైడెన్స్ సైతం టాస్క్ సెంటర్ అందిస్తుందని అన్నారు. పోటీ ప్రపంచంలో మనం నిలదొక్కుకోవా లంటే మన నైపుణ్యాలను ఎప్పటికప్పుడు మెరుగు పరుచుకోవాలని, ప్రపంచంలో వస్తున్న మార్పులకు సన్నద్ధం కావాలని, గతంలో కేవలం విద్యార్హతలతో మాత్రమే ఉద్యోగాలు లభించాయని, ప్రస్తుతం విద్యార్హతలతో పాటు తప్పనిసరిగా నైపుణ్యాలు, కమ్యూనికేషన్స్ స్కిల్స్ చాలా అవసరమని అన్నారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన జాబ్ మేళాలో 1500 మందికి పైగా విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, వారిలో 300 మందికి పైగా విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయని, 500 మంది ఎంపిక ప్రక్రియలో ఉన్నారని, అవసరమైన శిక్షణను అందించేందుకు టాస్క్ సెంటర్ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టాస్క్ సెంటర్ వద్ద అవసరమైన ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా టాస్క్ సెంటర్ ను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటామని, పెద్దపల్లి జిల్లాలోని యువతకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రివర్యులు సంపూర్ణ సహకారం అందజేస్తారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ దాసరి మమతా రెడ్డి మాట్లాడుతూ, పోటీ ప్రపంచంతో సమాంతరంగా పెద్దపెల్లి యువత ఎదిగేందుకు విద్యతో పాటు నైపుణ్యాల అభివృద్ధి అవసరమని, దీనికోసం ప్రత్యేకంగా టాస్క్ సెంటర్ ను ఏర్పాటు చేసిన రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రికి, పెద్దపల్లి ఎమ్మెల్యేకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పెద్దపెల్లి జిల్లాలో ఏర్పాటు చేసిన టాస్క్ సెంటర్ ను యువత పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, ఇక్కడ నైపుణ్యం గల అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, మార్కెట్ డిమాండ్ అనుగుణంగా అవసరమైన కోర్సులను పూర్తి చేసి ఉపాధి సాధన దిశగా యువత ముందుకు సాగాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి ఆదేశాల ప్రకారం పెద్దపల్లి జిల్లాలో టాస్క్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అన్నారు . రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 12 టాస్క్ కేంద్రాలు ఉన్నాయని, 750 పైగా విద్యా సంస్థలతో సమన్వయం చేసుకుంటూ ఇప్పటివరకు 18,000 మంది ఫ్యాకల్టీ 9 లక్షల పైగా యువతకు టాస్క్ ద్వారా శిక్షణ అందించామని, 110 పైగా కోర్సులకు శిక్షణ అందిస్తామని అన్నారు. టాస్క్ సెంటర్ ద్వారా యువతకు శిక్షణ అందించడంతోపాటు ప్రత్యేక ఉపాధి డ్రైవ్ లు, వినూత్న ఆలోచనలకు తోడ్పాటు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను సైతం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ ఏ.గంగా ప్రసాద్, మునిసిపల్ కమిషనర్ వెంకటేష్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## సవికాలంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు

**మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మి రాజమల్లు**

సుల్తానాబాద్ మార్చ్ 16( ప్రజా జ్యోతి) రానున్న వేసవి కాలంలో తాగునీటి సమస్యలు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్షి రాజమల్లు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అశోక్ నగర్ సమీపంలో ఉన్న త్రాగునీటి బావిని పరిశీలించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ గట్టెపల్లి మానేరు పరివాహక ప్రాంతం నుండి నిత్యం నీటి సరఫరా స్థానిక భావి కి జరుగుతుందని రానున్న వేసవికాలంలో ఎలాంటి ఇబ్బందులు ప్రజలకు తలెత్తకుండా మంచి నీరును అందించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు సిబ్బంది మంచినీటి క్లోరినేషన్ రోజు చేయాలనీ ఆదేశించారు ఎక్కడ లీకేజీలు ఉన్న సత్వరమే స్పందించి వాటిని పరిష్కరిస్తున్నామని వేసవికాలంలో ఎవరు ఇబ్బందులు పడవద్దనే సంకల్పంతోనే నిత్యం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## పాత పద్మ జడ్పీటీసీ పదవికి రాజీనామా చేయాలి

బీరుపూర్, మార్చి 16 (ప్రజాజ్యోతి): బీరుపూర్ మండల్ జడ్పీటిసిగా పాత పద్మరమేష్ కాంగ్రెస్ పార్టీ నుండి గెలిచి ఉన్నత పదవులు పొంది శనివారం రోజున నిజామాబాద్ ఎంపీ అరవింద్ సమక్షంలో బీజేపీలో చేరడంతో బీరుపూర్ మండల్ కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు భగ్గుమన్నారు. జడ్పీటిసికి వెంటనే రాజీనామా చేసి నిరూపించుకోవాలని హితువు పలికారు. 5 సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీ నుండి వివిధ రకాలుగా లబ్ధిపొంది తీరా సమయంలో పార్టీని మోసం చేసి బీజేపీలో చేరడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు ఎంపీపీ మసర్తి రమేష్, గుడిసె జితేందర్ యాదవ్, చేరుపూరి శుభాష్, రంగు లక్ష్మణ్, ఆడెపు తిరుపతి, తదితరులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ల చిత్రపటాలకు పాలాభిషేకం

మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : వంద రోజుల ప్రజా ప్రభుత్వ ప్రస్థానంలో భాగంగా తెలంగాణకు మణిహారం లాంటి సకల జనహిత సంక్షేమం కోసం వివిధ కులాల అభివృద్దే ధ్యేయంగా కార్పొరేషన్ ల ఏర్పాటుకు చర్యలు చేపడుతూ సీఎం రేవంత్ రెడ్డి తీసుకున్న నిర్ణయం హర్షనీయమని పట్టణ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల హనుమండ్ల యాదవ్ అన్నారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ కొమిరెడ్డి కరంచంద్ ఆదేశాల మేరకు శనివారం మెట్ పల్లి లోని పట్టణ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైతుల పట్ల రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయానికి కృతజ్ఞతగా రాష్ట్రంలో సబ్బండ వర్గాల జనహితం కోసం సీఎం రేవంత్ రెడ్డి చేపట్టిన కార్పొరేషన్ల ఏర్పాటుకు కృతజ్ఞతగా వారిద్దరి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. లోక్ సభ ఎన్నికల సందర్భంగా రైతుల పట్ల రాహుల్ గాంధీ తీసుకున్న నిర్ణయంసాహసోపేతమైనదని కొనియాడారు. కిసాన్ న్యాయ పేరిట ఐదు గ్యారంటీలను ప్రకటించిన రాహుల్ గాంధీ.. పంటల కనీసం మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తూ, వ్యవసాయ పరికరాలపై జిఎస్టి ఎత్తివేసేలా, రైతుల కోసం శాశ్వత రుణమాఫీ కమిషన్లు ఏర్పాటు చేసేలా, పంట బీమా సొమ్ము 30 రోజుల్లో నేరుగా బ్యాంకు ఖాతాలో జమ అయ్యేలా నికార్సైన హామీలు ఇవ్వడం రైతులపై ఆయనకు ఉన్న చిత్తశుద్ధిని ప్రతిబింబిస్తోందని కొనియాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి.. బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా ఎదగడానికి ఎంతగానో కృషి చేస్తున్నారని, ఈ బీసీల కోసం ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం ఆయనలోని పరిపూర్ణ నాయకత్వ లక్షణానికి నిదర్శనమని అన్నారు.ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు పట్టణ వార్డు కౌన్సిలర్ యామరాజయ్య, న్యాయవాది సురభి అశోక్, పెంట ప్రణయ్, కంతి హరి కుమార్, ఎల్లేష్, తోట భీమయ్య, సింగని మారుతి, చిదుగు కృష్ణ, ధోనోజు వెంకటేష్, షేర్ రాజు, పి ఎస్ రెడ్డి, సాయిలు, రాజేష్, రమేష్, ఇంతియాజ్, అన్వర్ తదితరులుపాల్గొన్నారు.



# కవిత అరెస్టుపై ఖనిలో బిఆర్ఎస్ నిరసన



గోదావరిఖని, మార్చి 16 (ప్రజా జ్యోతి) ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు పై బి ఆర్ ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది.శనివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో నిరసన తెలిపారు. నల్ల జెండాలతో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,మాజీ ఎమ్మెల్యే కొరుకాంటి చందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ ని లేకుండా చేయాలని కక్షపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ ఆరోపించారు.ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా కవితను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా ,రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ ప్రశ్నించే వారిని ఇబ్బందులకు గురి చేస్తోందని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బిజెపి ప్రభుత్వం ఇలాంటి చర్యలకు పాల్పడుతుందని అరెస్టు చేసిన కవితను బే షరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు పెంట రాజేష్ ,కల్వచర్ల కృష్ణ వేణీ, జనగామ కవిత సరోజినీ, కన్నూరి సతీశ్ కుమార్ ,నాయకులు నడిపెల్లి మురళీధర్ రావు, బోడ్డు రవీందర్, బోడ్డుపల్లి శ్రీనివాస్, నూతి తిరుపతి, జహిద్ పాషా , చల్లగురుగుల మొగిళి, పిల్లి రమేష్, మెతుకు దేవరాజ్ , చల్లా రవీందర్ రెడ్డి, ఆడప శ్రీనివాస్, అచ్చే వేణు ,అందె సదానందం, మాదాసు రామమూర్తి, తోకల రమేష్, జడ్సన్, బుర్ర శంకర్ గౌడ్, జక్కుల తిరుపతి, నిజా మోద్దీన్ ,మహంకాళీ అంజయ్య పాల్గొన్నారు



## నిఖిల్ భారత్ కాన్వెంట్ హై స్కూల్ కరస్పాండెంట్ మహర్షికి ఘన సన్మానం

మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన నిఖిల్ భరత్ హై స్కూల్ కరస్పాండెంట్.. వి.బీ మహర్షిని శనివారం మెట్ పల్లి పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి లక్ష్మణ్, యూత్ కాంగ్రెస్ నాయకులు. బొడ్ల ఆనంద్, కొంద్ర అరుణ్, నాగిని సురేష్, ముక్క సంతోష్ లు ఘనంగా సన్మానించారు.ఈకార్యక్రమంలో పలువురు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మెట్ పల్లి పట్టణంలో టిఆర్ఎస్ పార్టీ నాయకుల భారీ నిరసన

**ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేసిన టిఆర్ఎస్ పార్టీ శ్రేణులు**



మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : మెట్ పల్లి పట్టణంలో శనివారం టిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా టిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు ఆదేశాల మేరకు నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నిరసనగా పాత బస్టాండ్ ప్రాంతంలో ధర్నా నిర్వహించి ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఓ ఎమ్మెల్సీ నాయకురాలు అని చూడకుండా ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా పార్లమెంట్ ఎన్నికల ముందు అరెస్టు చేయడం శోచనీయమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల టిఆర్ఎస్ నాయకులు, పట్టణ టిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గీత కార్మికులకు గుర్తింపు కార్డుల పంపిణీ

మెట్ పల్లి ప్రతినిధి ( ఇబ్రహీంపట్నం) మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని డబ్బా గ్రామంలో శనివారం సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు చెట్ల చంద్రశేఖర్ గౌడ్ గితకార్మిక సంఘం సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు.అనంతరం అయన మాట్లాడుతూ జగిత్యాల ఏగ్రామంలోనైనా గీత కార్మికులకు గుర్తింపు కార్డులు తప్పులున్న, కొత్తవి కావాలన్నా అందరికీ తొందరలోనే గుర్తింపు కార్డులని ఇప్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం మండల అధ్యక్షులు నేరెళ్ల సుభాష్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షులు ఎలుక అశోక్ గౌడ్, నేరెళ్ల సత్యంగౌడ్, కానిస్టేబుల్ రామ్ చరణ్, గౌడ సంఘ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, బత్తిని మహేందర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# గల్ఫ్ కార్మికులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**గల్ఫ్ మృతుల కుటుంబాలకు రాష్ట్రంలోనే మొట్టమొదటి చెక్కు పంపిణీ**

**మృతుని కుటుంబానికి 5 లక్షల చెక్కును అందజేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



కోనరావుపేట మార్చి16(ప్రజాజ్యోతి):గల్ఫ్ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉండి ఆదుకుంటుందని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన బొడ్డు బాబు మూడు నెలల క్రితం గల్ఫ్ (బహరేన్) లో ప్రమాదవశాత్తు మృతి చెందాడు.కాగా మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ప్రభుత్వం నుండి 5 లక్షల రూపాయల నష్టపరిహారం చెక్కును శనివారం అందజేశారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్రంలోనే గల్ఫ్ బాధితులకు ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ మేనిఫెస్టో లో చెప్పిన విధంగా మొట్ట మొదటి చెక్కును అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గల్ఫ్ కార్మికుల సమస్యలను ఎన్నికల మేనిఫెస్టో లో పెట్టామని, గల్ఫ్ కార్మికులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వమేననీ అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ 10 ఏళ్ల పరిపాలనలో 2 వేల మంది గల్ఫ్ కార్మికులు మరణించిన వారి కుటుంబాలను పట్టించుకున్న పాపన పోలేదని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి గల్ఫ్ కార్మికులు చనిపోతే వచ్చే 5 లక్షల రూపాయల చెక్కును మొట్ట మొదటి సారిగా వేములవాడ నియోజకవర్గంలోని బావుసాయిపేట,మర్రిపల్లి గ్రామాలలోని వారి కుటుంబాలకు అందిస్తున్నామని ఆయన తెలిపారు.గల్ఫ్ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు.గల్ఫ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బావుసాయి పేట ఎంపీటీసీ షేక్ యాష్మిన్ పాషా, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగన్మోహన్ రెడ్డి, జిల్లా నాయకులు గొట్టే రుక్మిణి, బైరగోని నందు గౌడ్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# లోక్ అదాలత్ లో ఇరు వర్గాలకు సమన్యాయం

**జూనియర్ సివిల్ జడ్జి ప్రియాంక**



సుల్తానాబాద్ మార్చ్ 16( ప్రజా జ్యోతి) లోక్ అదాలత్ ద్వారా ఇరు వర్గాలకు సమన్యాయం జరుగుతుందని సుల్తానాబాద్ మున్సిఫ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి జి.ఎస్.ఎల్. ప్రియాంక అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కోర్ట్ ఆవరణలో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రియాంక మాట్లాడుతూ క్షణికావేశంలో చేసిన నేరాలకు కోర్టుల చుట్టూ తిరిగి వ్యయప్రయాసాలకు గురికాకుండా రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చునని, ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరించబడ్డ కేసులలో ఇరువర్గాలకు న్యాయం జరుగుతుందనీ అన్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు తప్పకుండా పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడపడం నేరమని అన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులకు గత వారం రోజుల నుండి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఈ లోక్ అదాలత్ లో పలు క్రిమినల్, చెక్ బౌన్స్ , కుటుంబ తగాదాలు, భార్యాభర్తల వివాదాలు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులకు సంబంధించి 230 కేసులను పరిష్కరించునట్లు తెలిపారు. పలువురు న్యాయవాదులు వివిధ చట్టాలపై కక్షదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జోగుల రమేష్, ఏపిపి శ్యాం ప్రసాద్, ఏజిపి మేకల తిరుపతిరెడ్డి, లోక్ అదాలత్ సభ్యులు ఆలూరి శ్రీనివాసరావు, సుల్తానాబాద్, జూలపల్లి, శ్రీరాంపూర్ ఎస్ఐ లు శ్రవణ్ కుమార్, శ్రీధర్, ఓంకార్ యాదవ్ లతో పాటు పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపావాస దీక్షలో మానవత్వం చాటుకున్న యువకుడు



మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : పవిత్ర రంజాన్ మాసం ను పురస్కరించుకొని ఉపవాస దీక్షలో ఉండి కూడా ఓ యువకుడు మానవత్వం చాటుకున్నాడు వివరాల్లోకి వెళితే...ఏ సమయంలో అయిన, ఎక్కడ అయిన ఓ పాజిటివ్ రక్తం అవసరం అంటే ముందుగా స్పందించి రక్తదానం చేసే సామాజిక సేవకుడు మహమ్మద్ రిజ్వాన్. ప్రతి 3 నెలలకి ఒకసారి తప్పకుండా రక్తదానం చేస్తూ ఇప్పటికి 14వ సారి రక్తదానం చెయ్యడం జరిగింది. పవిత్ర రంజాన్ ఉపావాస దీక్షలో ఉండి కూడా అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం గురుంచి సమాచారం తెలయగానే మానవత్వంతో వెంటనే స్పందించి రక్తదానం చేసాడు మహమ్మద్ రిజ్వాన్. మెట్ పల్లి పట్టణంలోని సాయి సంజీవని హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న లావణ్య అను మహిళకి అత్యవసర చికిత్స నిమిత్తం ఓ పాజిటివ్ రక్తం అవసరం అని పేషెంట్ బంధువులు సోషల్ మీడియాలో సమాచారం తెలుపగా రిజ్వాన్ వెంటనే స్పందించి స్వచ్ఛందంగా బ్లడ్ బ్యాంక్ కి వెళ్లి రక్తం ఇవ్వడం జరిగింది.అత్యవసర సమయంలో మానవత్వంతో రక్తదానం చేసి ప్రాణదాతగా నిలిచిన రిజ్వాన్ ను బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, యువజన సంఘాల సభ్యులు, మైనారిటీ నాయకులు, పేషెంట్ బంధువులు,ఈ సందర్భంగా ఆయనను అభినందించారు.

## ఐజెయు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గానికీ ఘన సన్మానం



మెట్ పల్లి ప్రతినిధి మార్చి 16 ( ప్రజా జ్యోతి) : మెట్ పల్లి లోని కాంగ్రెస్ పార్టీ సుజిత్ రావు నివాసంలో మల్లాపూర్ మండల టియుడబ్ల్యూజె- ఐజెయు ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గన్ని టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు ఘనంగా సన్మానించారు.ఐజెయు అధ్యక్షులు గుగ్గిళ్ల రాజశేఖర్(సూర్య పత్రిక),ఉపాధ్యక్షుడు సబావత్ మల్లేష్(ఆంధ్ర ప్రభ పత్రిక),ప్రధాన కార్యదర్శి నిమిషకవి రాజేష్ ను (ప్రజా జ్యోతి పత్రిక) శాలువా తో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు బద్దం శ్రీనివాస్ రెడ్డి,బద్దం రామచందర్ రెడ్డి ,కాంగ్రెస్ నాయకులు కల్లెడ గంగాధర్,వెంకట గిరి,ఇప్పపల్లి గణేష్, మొగిలి రాజేందర్, సూర్యనారాయణ లతో పాటు తదితరులు ఉన్నారు.

## 18 న మెట్ పల్లి బార్ అసోసియేషన్ ఎన్నికలు



మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : ఈ నెల 28 గురువారం రోజున మెట్ పల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గానికి ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారులు మగ్గిడి వెంకట నర్సయ్య, సోమ భూమేశ్వర్, కోటగిరి వెంకట స్వామి, పసునూరి శ్రీనివాస్ లు తెలిపారు. శనివారం 153 మంది న్యాయవాదులతో కూడిన ఓటరు లిస్టుని నోటీస్ బోర్డుపై ప్రదర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ, ఏప్రిల్ 1, 2024 నుండి మార్చ్ 31, 2025 కాలానికి సంబంధించి ఎగ్జిక్యూటివ్ బాడీ సెలక్షన్ కోసం ఈ నెల 18 నుండి 20 వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 22 వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచిన వారికి ఈ నెల 28 రోజున ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలు ప్రకటిస్తామని తెలిపారు. స్టేట్ బార్ కౌన్సిల్ నిబంధనలు మరియు మార్గదర్శకాల ప్రకారమే ఎన్నికలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ క్రయ,విక్రయాలపై కార్పొరేషన్ కమిషనర్ తనిఖీలు




గోదావరిఖని, మార్చి 16 (ప్రజా జ్యోతి) నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల క్రయ,విక్రయాల పై రామగుండం కార్పొరేషన్ కమిషనర్ సి. హెచ్. శ్రీకాంత్ కొరడా ఝులిపించారు.శనివారం గోదావరిఖని లక్ష్మీ నగర్,కళ్యాణ్ నగర్ లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో 50 కిలోల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆయా దుకాణాల నిర్వాహకుల నుండి రూ.9000లు జరిమానా గా వసూలు చేశారు.ఈ తనిఖీలలో హెల్త్ అసిస్టెంట్లు కిరణ్,వైకుంఠం, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ మధుకర్,ఎం ఐ ఎస్ ఆపరేటర్ శ్రీకాంత్ తోపాటు నగర పాలక సంస్థ సానిటరీ సూపర్ వైజర్లు,సిబ్బంది పాల్గొన్నారు.



## ఎస్ఎస్‌సి పరీక్ష కేంద్రాలను పరిశీలించిన తహసీల్దార్

మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదుర్,ఇబ్రహీంపట్నం లలో ఎస్ ఎస్ సి పరీక్ష కేంద్రాలను ఇబ్రహింపట్నం తహశీల్దార్ ప్రసాద్ శనివారం పరిశీలించారు.ఈసందర్భంగా విధ్యర్ధులకు పరీక్షలు రాసేందుకు అనుగుణంగా గదులు,త్రాగు నీరు తదితర వసతులను పరిశీలించారు. కాగ ఇబ్రహింపట్నం మోడల్ స్కూల్ లో 260,గోదుర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో 82 మంది విధ్యార్ధులు పరిక్ష లు రాయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

**మెట్ పల్లి డిఎస్పి ఉమామహేశ్వర్**



మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : పవిత్ర రంజాన్ పండుగను కుల మతాలకు అతీతంగా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మెట్ పల్లిడిఎస్పీఉమామహేశ్వర్ అన్నారు. శనివారం డిఎస్పీ కార్యాలయంలో ముస్లిం పెద్దలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పీస్ కమిటీ సభ్యులు పోలీసులకు ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారని డిఎస్పీ పేర్కొన్నారు. ముస్లింలకు రంజాన్ మాసం చాలా పవిత్రమైన దని ఎలాంటి సమస్యలు ఎదురైనప్పుడు తమ దృష్టికి తీసుకు రావాలని ఈ సందర్భంగా ముస్లిం పెద్దలను కోరారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి సీఐ నవీన్, ఎస్ ఐ చిరంజీవి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి

మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకను మెట్ పల్లి స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక గాంధీ చౌరస్తాలో గాంధీ విగ్రహం ముందు పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి మైలారపు లింబద్రి ,మెట్ పల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు,పలువురు ఆర్య వైశ్య సోదరులు ఘనంగా పూలమాలు వేసి నివాళులర్పించారు.అనంతరం స్నేహాలయ ఫ్రెండ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్ మాట్లాడుతూ త్వరలో అమరజివి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని పున ప్రతిష్ట కార్యక్రమాన్ని చేపడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షులు కోట సుమన్, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి ఎల్మి రవి, దొంతుల లక్ష్మీనారాయణ, కొత్త నవీన్,చకినం కేదార్నాథ్, చాడ సురేష్, కోట జీవన్, బండారి శివ, బండారి ప్రసాద్, పడిగెల పవన్, చిట్టి మెల్లి శ్రీనివాస్, అనంతుల రమేష్, ఎలగందుల సంతోష్, ఎలగందుల వేణుగోపాల్, పడిగెల పవన్,గంప శ్రీనివాస్, కట్కూరి రాజు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



# పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం

**భయం వదిలి పరీక్షలకు హాజరు కావాలి**
**ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి**

జమ్మికుంట, మార్చి16( ప్రజా జ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం నుండి నిర్వహించబోయే పదవ తరగతి పరీక్షలకు జమ్మికుంట మండల కేంద్రంలోని పరీక్ష కేంద్రాలు పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు మండల విద్యాధికారి విడపు శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట పట్టణంలో 5 పరీక్ష కేంద్రాలు,వావిలాల గ్రామంలో 1పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ పరీక్ష కేంద్రాలలో మొత్తం జమ్మికుంట నుండి ప్రభుత్వ పాఠశాలల తరపున 339 మంది, ప్రైవేట్ పాఠశాల నుండి 622 మంది మొత్తంగా జమ్మికుంట మండలంలో 961 మంది విద్యార్థులు పరీక్ష రాయబోతున్నట్లు తెలిపారు..ఇట్టి



పరీక్ష కేంద్రాలకు జిల్లా విద్యాశాఖ అధికారి చీఫ్ సుపరిండెంట్లు, డిపార్ట్మెంటల్ ఆఫీసర్లు, సిట్టింగ్ స్క్వాడ్ లను, ఇన్విజిలేటర్ లను ఇతర సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు మున్సిపల్ నుండి మినరల్ వాటర్ సౌకర్యాన్ని కూడా మున్సిపల్ చైర్మన్, కమిషనర్ అంద చేస్తున్నట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో సెల్ ఫోన్లు తీసుకురావద్దని ఒకవేళ ఎవరైనా తీసుకు వచ్చినట్లయితే వారిని సస్పెండ్ చేస్తారని అధికారులు తెలిపినట్లు సూచించారు... విద్యార్థులందరూ కూడా పరీక్ష కేంద్రానికి ఒక గంట ముందుగానే చేరుకోవాలని ఏలాంటి ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసి మంచి ఫలితాలను సాధించే దిశగా కృషి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని విద్యారణ్య ఆవాస పాఠశాలలో పరీక్ష కోసం ఏర్పాటుచేసిన ఏర్పాట్లని మండల విద్యాధికారి పరిశీలించారు... చీఫ్ సూపర్డెంట్ రాజేంద్రప్రసాద్, డిపార్ట్మెంటల్ అధికారి జ్ఞాన సుధాకర్ తో ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. ఇల్లందకుంట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 96 మంది విద్యార్థులు,టేకుర్తి గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్ లో 50మంది విద్యార్థులు ఈ రెండు పరీక్ష కేంద్రాల్లో హాజరుకానున్నట్లు తెలిపారు.

# ఎన్నికల వేళ బిఆర్ఎస్, బీజేపీలు కొత్త డ్రామాలు

**కాంగ్రెస్ పార్టీ ఓటు బ్యాంక్ ఓర్వలేక చిల్లర రాజకీయాలు**
**కవిత అరెస్టుతో రెండు ఒకటేనని తేటతెల్లం**
**కాంగ్రెస్ పార్టి ఇంచార్జి కేకే మహేందర్ రెడ్డి**

సిరిసిల్ల, మార్చి 16, (ప్రజాజ్యోతి): లోక్ ఎన్నికల వేళ బిఆర్ఎస్, బీజేపీలు కొత్త డ్రామాలకు తెరలేపాయని, కవిత అరెస్టుతో రెండు ఒకటేనని తేటతెల్లం అయిందని సిరిసిల్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ కెకె మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం లోని కెకె మహేందర్ రెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడూతూ నవంబర్ లో జరిగిన ఎలక్షన్ లో కాంగ్రెస్ పార్టీ కి ప్రజలు పట్టం కట్టారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనను చూసి ఓర్వలేక ఎంపి ఎన్నికలు సమీపిస్తున్న వేళ బిజెపి, బిఆర్ఎస్ కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ లో జరిగిన అవకతవకలపై బండి సంజయ్ ఎన్నో ఆరోపణలు చేశారని, కేసిఆర్, కేటిఆర్ లు జైలుకు పోవటం ఖాయమని తెలిపినా, ఏనాడు విచారణ చేపట్టి అరెస్ట్ చేయనివారు ఎంపి ఎలక్షన్ ల ముందు ప్రజల దృష్టి మళ్ళించడానే కవిత అరెస్ట్ కు తెర లేపారని అన్నారు. బిజెపి, బిఆర్ఎస్ ఒక్కటేననే విషయం ప్రజలకు తెలిసిపోయిందని, కవితని అరెస్ట్ ఒక బూచి మాత్రమే అని పేర్కొన్నారు. బిజెపి నాయకుల పై, వారి పార్టీ కార్యకర్తలకే నమ్మకం లేకుండా పోయిందని ఎద్దేవచేశారు. కవిత అరెస్ట్ చేసినంత మాత్రానా బిజెపికి అనుకున్నంత మైలేజ్ రాదని జోస్యం చెప్పారు. కవిత అరెస్ట్ అప్రజాస్వామికమంటున్న కేటీఆర్, నేరెళ్ల ఘటన గుర్తు చేసుకోవాలని సూచించారు. కెసిఆర్, కేటీఆర్ కు ప్రజాస్వామిక విలువలపై మాట్లాడే అర్హత లేదని,



రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బిజెపి, బిఆర్ఎస్ కు బుద్ది చెప్పుతూ, ప్రజలు కాంగ్రెస్ కు పట్టం కడతారని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టి పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాశ్, గడ్డం నర్సయ్య, గోలి వెంకటరమణ, వైద్య శివప్రసాద్, యేల్లే లక్ష్మినారయణ, కంసాల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# ముస్తాబాద్ మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ

ముస్తాబాద్ మార్చి 16(ప్రజాజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో సిసి రోడ్లు,డ్రైనేజీ, బోరు మరియు మోటార్, హైమాస్ లైట్స్,గూడూరు మరియు చిప్పలపల్లి, వెంకట్రావు పల్లి లో తాగునీటి సమస్య నివారించేందుకు బోరు మరియు మోటార్లు, చికోడు మరియు నామాపూర్ గ్రామాలలో సిసి రోడ్లు వేపిస్తూ భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్తాబాద్ మండలంలో ఇప్పటివరకు దాదాపు 50 లక్షల వరకు పనులు చేశామని,ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే రేవంత్ రెడ్డి తన మార్కు పాలన చూపిస్తూ ఇచ్చిన గ్యారెంటీలను అమలు



చేస్తూ, స్పెషల్ డెవలప్మెంట్ ఫండు కింద ప్రతి నియోజకవర్గానికి ఇచ్చిన నిధులను సద్వినియోగపరిచేలా ఆయా నియోజకవర్గ ఇన్చార్జి లను ఆదేశిస్తూ ప్రతి రూపాయి ప్రజాభివృద్ధికి వినియోగపడేలా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. ఇన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న కాంగ్రెస్ పార్టీని రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు ఆశీర్వదించాలని,మతం పేరుతో వస్తున్న బిజెపిని,పదేళ్ల పాలనలో అడ్డగోలుగా దోచుకున్న బిఆర్ఎస్ పార్టీని ఓటుతో బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏళ్ల బాల్ రెడ్డి, ఎంపిటిసి గుండెల్లి శ్రీనివాస్ గౌడ్,పట్టణ అధ్యక్షుడు గజ్జల రాజు,జిల్లా ప్రధాన కార్యదర్శి కొండం రాజిరెడ్డి,ప్యాక్స్ డైరెక్టర్ కొండల్ రెడ్డి,బీసీ సెల్ మండల అధ్యక్షుడు శీల ప్రశాంత్,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు తలారి నర్సింలు, యూత్ కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు రంజాన్ నరేష్,తాళ్ల విజయ రెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షులు ఎదునూరి భానుచందర్ మరియు పలు గ్రామాల గ్రామ శాఖ అధ్యక్షులు,కాంగ్రెస్ సీనియర్ నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రిని కలిసిన రెడ్డి సంఘం మాజీ అధ్యక్షులు చక్రధర్ రెడ్డి

సిరిసిల్ల, మార్చి 16, (ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా రెడ్డి సంఘం మాజీ అధ్యక్షులు కనమేని చక్రధర్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని శనివారం వారి గృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం సీఎం రెవబతగ రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా కనమేని చక్రధర్ రెడ్డి మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటుపై గత ప్రభుత్వానికి 10 ఏళ్లుగా విజ్ఞప్తి చేశామని, కానీ గత పాలకులు పట్టించుకోలేదన్నారు. పైగా రెడ్డి కార్పొరేషన్ కోసం ఉద్యమాలు చేసినా రెడ్డి కుల బాంధవులపై కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. దీంతో పేద రెడ్డి కుటుంబాలకు విద్య, వైద్యం, ఉద్యోగాలు అందకుండా పోయాయని తెలిపారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో 17 సామాజిక వర్గాలకు ప్రత్యేక కార్పొరేషన్ లు ఏర్పాటు చేశారని, దీంతో లక్షలాది మంది ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.





## ఘనంగా పోషణ్ పక్వాడ కార్యక్రమం

కాలువ శ్రీరాంపూర్ ,(ప్రజా జ్యోతి), మార్చి 16 : కాల్వ శ్రీరాంపూర్ మండల కేంద్రంలోని అంగన్వాడి ఫస్ట్ సెంటర్లో పోషణ్ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున అంగన్వాడీలో చదువుకుంటున్న పిల్లల తల్లులతో ఐసిడిఎస్ సూపర్వైజర్ సావిత్రి ప్రతిజ్ఞ చేయించారు అనంతరం అక్షరా భ్యాసం అన్న ప్రసన్న కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్య క్రమంలో అంగన్వాడి టీచర్ హాజీరతోపాటు వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు ఆయలు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్ ను ఢీకొని లారీ డ్రైవర్ మృతి



సుల్తానాబాద్ మార్చ్ 16( ప్రజా జ్యోతి) హైదరాబాద్ నుండి చత్తీస్ గఢ్ రాష్ట్రంలోని రాజానంద్ గాంలోని ఆధారిత విద్యుత్ ప్లాంట్ కు చెత్తను తీసుకు వెళ్తున్న సిజి 08 ఏవై 9261 నెంబర్ గల లారీ శనివారం తెల్లవారుజా మున సుల్తానాబాద్ పట్టణంలోని రాజీవ్ రహదారి డివైడర్ను ఢీకొని లారీ బోల్తా పడింది సమాచారం అందుకున్న ఎస్సై శ్రవణ్ తో పాటు పోలీస్ సిబ్బంది పలువురి సాయంతో లారీ క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్ తోపాటు క్లీనర్ ని బయటికి తీసి వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని చికిత్స పొందుతూ డ్రైవర్ రాజన్ననిపోగ మృతి చెందగా క్లీనర్ హితేంద్ర మున్నాలాల్ తీవ్రంగా గాయాలయని మృతి చెందిన డ్రైవర్ మహారాష్ట్రలోని గుంద్రియా జిల్లా సిర్పూర్ గ్రామానికి చెందినవారీగా పోలీసులు గుర్తించారు

## బాధితుడికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత

**పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు**

కాల్వ శ్రీరాంపూర్ ,(ప్రజా జ్యోతి), మార్చి 16 కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మీర్జంపేట్ గ్రామానికి చెందిన మూల రమేష్ అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్నారు. వైద్యం కొరకు సీఎం సహాయనిధి పథకంలో మంజూరైన 16 వేల రూపాయల చెక్కును పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐబి గెస్ట్ హౌస్ లో శనివారం రోజున బాధితుడికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అందజేశారు సీఎం సహా యనిధి ఆర్థిక సహాయానికి కృషిచేసిన ఎమ్మెల్యే చింతకుంట విజయ రామారావుకు బాధిత కుటుంబీకులతో పాటు మీరు చంపేట్ మాజీ ఎంపీటీసీ పోచల సదానందం కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్య కర్తలు తదితరులు పాల్గొన్నారు



# కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలి

**సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భాస్కర్**

గోదావరిఖని, మార్చి 16 (ప్రజా జ్యోతి) కాంట్రాక్ట్ కార్మి కులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో ని శ్రామిక భవన్ లో కార్యకర్తల ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ఇటీవలే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 73 షెడ్యూల్ ప్రకారం పరిశ్రమల్లో పనిచేస్తున్న కోటి 20 లక్షల మంది కార్మికు లకు వర్తించే జీవోలను డ్రాఫ్ట్ నోటిఫికేషన్ ఇచ్చిందని, పాత వేతనం అలాగే ఉంచి జీవో నెంబర్లు మార్చి కొత్త జీవోలు ఇచ్చినట్టుగా ప్రకటించిందన్నారు. వేతనాలు పెరగకుండా జీవో నెంబర్ మారడం మూలంగా కార్మి కులకు ఏరకంగా ప్రయోజనమో రాష్ట్ర ప్రభుత్వం ఆలో చించాలని, 5 సంవత్సరాలకు ఒకసారి సవరించాల్సిన కనీస వేతనాల జీవోలను గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలుగా సవరించకుండా కార్మిక వర్గానికి ద్రోహం చేసిందని ఆరోపించారు.. గత అసెంబ్లీ ఎన్నికల్లో కార్మిక వర్గం బిజెపి, బీఆర్ఎస్ ను ఓడించిం దని,కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ వేతనాలు పెంచుతుందని, కోటి ఆశలతో ఎదురు చూస్తున్న కార్మి కులకు ఏమాత్రం ప్రయోజనం లేని కొత్త సీసాలో పాత సార మాదిరిగా వేతనాలు సవరించినట్టుగా డ్రాఫ్ట్ నోటీ సుకేషన్ ఇవ్వడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరే కిస్తుంద న్నారు. పెరిగిన నిత్యవసర వస్తువుల, సరుకుల ధరలను బేరీజు వేసుకుంటే కనీస వేతనం కార్మికుడికి నెలకు 26 వేలు ఉండాలని ప్రభుత్వ లెక్కలే చెబుతున్నాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన డ్రాఫ్ట్ నోటిఫికేషన్లను సవరించి కనీస వేతనం నెలకు రూ.26 వేలు నిర్ణయించి ఫైనల్ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ అంశాల సింగరేణి, ఎన్టీపీసీ, ఆర్ఎఫ్సిఎల్, రైల్వే కాంట్రాక్ట్ కార్మికులు, రైస్ మిల్ వర్కర్స్, బసంత నగర్ తదితర పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులు, కాంగ్రెస్ ప్రభుత్వ తప్పుడు విధానాన్ని వ్యతిరేకిస్తూ కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని లేబర్ కమిషనర్ కు వినతి పత్రాలు ఇవ్వాలని, స్థానిక ఎమ్మెల్యేల ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి కి వినతి పత్రాలు పంపించాలని, కాంగ్రెస్ ప్రభుత్వం కార్మిక వర్గానికి నష్టం చేసే విధానా




లను ఎండగట్టడానికి విస్తృత ప్రచారం నిర్వహించాలని, ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకుంటే ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు జిల్లా నాయకులు ఎన్, బిక్షపతి, మెండే శ్రీనివాస్, సిహెచ్, అరవింద్,ఎం, రామాచారి, బి, వనజారాణి, జి, జ్యోతి, నాంసాని శంకర్, గీట్ల లక్ష్మారెడ్డి, టి. మల్లేష్, కే, కృష్ణకుమారి, ఎన్, నర్సయ్య పాల్గొన్నారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**పాల్గొన్న ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

రుద్రంగి మార్చి 16 ప్రజా జ్యోతి: రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుండే భక్తులు ఆలయం వద్దకు చేరుకొని ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు రోజు లపాటు సాగిన కార్యక్రమంలో వేద పండితులు హోమాలు, యాగాలు, కుంకుమ పూజలు నిర్వహిం చారు.అత్యంత భక్తి పెద్దలతో ప్రతిష్టాపన కార్యక్రమం



అంగరంగ వైభవంగా జరిగింది. శనివారం నాడు అయ్యప్ప స్వామి ధ్వజస్తంభ ప్రతిష్టాపన మరియు విచ్చేసిన భక్తులకు మహా అన్నదాన కార్యక్రమం నిర్వ హించారు.ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ , వేముల వాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అయ్యప్ప స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ స్వామి వారి ఆశీస్సులతో సుభిక్షంగా వర్ధిల్లాలని వారికి ఎలాంటి కష్టాలు రాకుండా స్వామి వారు చూసుకోవాలని అన్నారు. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి సహకరించిన దాతలకు రుద్రంగి అయ్యప్ప స్వామి సేవ సమితి సభ్యులు ధన్యవాదాలు తెలిపింది.

### ముత్తారం ఎస్సై మధుసూదన్ రావు ఆధ్వర్యంలో

# పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించి మంచి భవిష్యత్తు ఎంచుకోవాలి**
**మంథని సిఐ, వెంకటేష్ కృష్ణ, ఎస్సై మధుసూదన్ రావు**

ముత్తారం మార్చి ,16 (ప్రజా జ్యోతి) మండలంలోని పోతారం, లక్కారం, ముత్తారం, అడవి శ్రీరాంపూర్, ఓడేడ్, ఖమ్మంపల్లిలోని మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ, ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదువు తున్న విద్యార్థులకు ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు ఆ ధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లు, పెన్నులను శనివారం పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా మంథని సిఐ వెంకటేష్ కృష్ణ హాజరు కాగా ఆయన చేతుల మీదుగా విద్యార్థు లకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభ త్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ ధీటుగా ఫలితాలను సాధించాలని, విద్యార్థులు ఆందోళన కు గురి కాకుండా పరీక్షలు వ్రాయాలని అన్నారు. 10వ తరగతి అంటేనే జీవితానికి మొదటి మెట్టని అన్నా రు. మొదటి మెట్టు నుండి పీజీ వరకు క్రమశిక్షణగా చదువుకుంటే రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉం టుందని తెలిపారు. 10వ తరగతి పరీక్షల్లో 10 జిపిఎ సాదించిన విద్యార్థులకు



రామగుండం కమిషనర్ చే తుల మీదుగా మొదటి బహు మతిగా నగదు అందిస్తామని అన్నారు. కష్టపడి చదివి బంగారు భవిష్యత్కు బా టలు వేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయ లు పాల్గొన్నారు.

# నూర్ భాష దూదేకుల కార్పొరేషన్ తక్షణమే ఏర్పాటు చేయాలి

**ఆల్ బీసీ మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్**

జమ్మికుంట,మార్చి16 (ప్రజా జ్యోతి ): తెలంగాణ రాష్ట్రంలోఏర్పాటు చేసినటువంటి 16 కార్పొరేషన్లతో పాటు నూర్ భాషా దూదేకుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేస్తున్నట్లు ఆల్ బీసీ మైనారిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అంకూస్ శనివారం జమ్మికుంట లో జరిగిన విలేకరుల సమావేశం లో విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అంకూస్ మాట్లాడుతూ గతంలో ఇచ్చినటువంటి దూదేకుల ఫెడరేషన్ జీవో ఎంఎస్ నెంబర్ 125 ద్వారా ఫెడరేషన్ను ఇంప్లిమెంట్ చేయలేదు ముస్లిం జనాభాలో అంతర్భాగమైన దూదేకుల జనాభా దాదాపు 70 శాతం ఉంటుందని అన్నారు..దూదేకుల కులం సామాజికంగా, ఆర్థికంగా,



రాజకీయంగా వెనుకబాటుతోని వివిధ చేతి వృత్తి పనులు చేసుకుంటూ జీవన ఉపాధి తో గడుపుతున్నామని అన్నారు..దూ దేకుల కులం మనుగడ పొందాలంటే ప్రత్యేక కార్పొరే షన్ ఏర్పాటు చేసి తగిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందిం చినట్లయితే దూదేకుల కులం లో ఉన్నటువంటి నిరుపేదలు కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం పొంది వారి జీవితాలు బాగుపడుట కొరకు ఎంతో చేయూతనిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేడుకున్నారు.

### మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ను

# పరామర్శించిన ఎమ్మెల్యే

మల్యాల, మార్చ్ 16 (ప్రజాజ్యోతి) : చొప్పదండి మాజీ ఎమ్మెల్యే శంకర్ రవి శంకర్ కరీంనగర్ లోని అపోలో ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న మల్యాల మండలం తక్కలపెల్లి గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉత్కం గంగాధర్ ను శనివారం పరామర్శించారు.





## ఇఫ్తార్ విందులో కాంగ్రెస్ నేత కేకే మహేందర్ రెడ్డి

సిరిసిల్ల, మార్చి 16, (ప్రజాజ్యోతి): సిరిసిల్ల పట్టణంలో కొత్త బస్టాండ్ మదీనా మజీద్ సాయి నగర్ యూత్ ఆధ్వర్యంలో రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా శుక్రవారం ఇఫ్తార్ విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఇఫ్తార్ విందుకు ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఖాదర్, అజం, బాబర్, మజీద్, అజార్,ఖాజా, రియాజ్, రఫీక్, ఆజ్జు, అహ్మద్, మైనుద్దీన్, హర్షద్, పర్వీజ్, సమీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాజన్న సేవలో ఎస్పీ అఖిల్ మహాజన్



వేములవాడ, మార్చి 16:, (ప్రజాజ్యోతి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం ఎస్పీ అఖిల్ మహాజన్ దర్శించుకున్నారు. అలయానికి విచ్చేసిన ఎస్పీకి ముందుగా ఆలయ మర్యాదల ప్రకారం అర్చకులు స్వస్తి స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణం అనంతరం ఎస్పీ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి పూజ అనంతరము కోడె ముక్కులు చెల్లించుకున్నారు. కళ్యాణమండపంలో ఎస్పీకి ఆలయ అర్చకులు విదోక్త ఆశీర్వచనము చేశారు. అనంతరం పర్యవేక్షకులు బి తిరుపతిరావు లడ్డు ప్రసాదం అందజేశారు. వారి వెంట ఆలయ ఇన్స్పెక్టర్ చెక్కిళ్ల అశోక్ తదితరులు ఉన్నారు.

## రాజన్నను దర్శించుకున్న ఉప లోకాయుక్త జస్టిస్




వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని శనివారం తెలంగాణ రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ వి నిరంజన్ రావు దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి దర్శనం అనంతరము నాగిరెడ్డి మండపంలో ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేశారు. ఉప లోకాయుక్త జస్టిస్ దంపతులకు ఆలయ ఇంచార్జీ పర్యవేక్షకులు నాగుల మహేష్ లడ్డు ప్రసాదం అందజేశారు.

## తాళం వేసిన ఇంట్లో చోరీ

ముస్తాబాద్ మార్చి 16(ప్రజాజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలంలోని వెంకయ్యకుంట గ్రామంలో బాధితుల కథనం ప్రకారం వెంకయ్య కుంట గ్రామానికి చెందిన కంకణాల మల్లవ్వ తన ఇంటికి తాళం వేసి కొడుకు ఇంట్లో పడుకోగా, గుర్తుతెలియని దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లో బీరువా తాళం పగలగొట్టి నగదు 8600 రూపాయలు మరియు బంగారు రింగులు,పట్ట గొలుసులు ఎత్తుకెళ్లారని మల్లవ్వ కొడుకు రాజు దరఖాస్తు ఇవ్వగా కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టామని ముస్తాబాద్ ఎస్సై కే.శేఖర్ రెడ్డి తెలిపారు.

# ప్రజలు తిరస్కరించినా మారని బిఆర్ఎస్ నేతల బుద్ధి

**అవినీతి సొమ్ముతో**
**ఎన్నికల బరిలో నిలవాలనే యోచన**
**బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల ఇండ్లలో**
**సోదాలు జరపాలి**
**కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు**
**కవ్వంపల్లి సత్యనారాయణ**

కరీంనగర్, మార్చి 16, (ప్రజాజ్యోతి): అవినీతి సొమ్ముతో ఎన్నికల బరిలో నిలవాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కరీంనగర్ పట్టణంలోని విఆర్ఎస్ నేత మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కు చెందిన వ్యాపార సంస్థ అయినటువంటి ప్రతిమ మల్టీప్లెక్స్ లో పోలీసులు విశ్వసనీయ సమాచారంతో తనిఖీ చేయగా 6 కోట్ల 66 లక్షల రూపాయల అవినీతి సొమ్ము దొరకడం విచారకరం అన్నారు. కేవలం లోక్సభ ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ఎన్నికల కోడ్ ప్రకటించే రోజు వరకు వినోద్ కుమార్ కు చెందిన ఈ వ్యాపార సంస్థలో 6 కోట్ల రూపాయలు దాచిపెట్టడం జరిగిందంటే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తమ వ్యాపార సంస్థలలో టిఆర్ఎస్ నేతలు ఎన్ని కోట్ల రూపాయలు అవినీతి సొమ్మును దాచి పెట్టారో అని అనుమానాలకు దారితీస్తుందన్నారు. కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి ఎదురుగా ఉన్న మల్టీప్లెక్స్ లో ఆరు కోట్ల రూపాయలు దాచిపెట్టడం జరిగిందంటే నగర శివారులో సుదూర ప్రాంతాలలో, టిఆర్ఎస్ పార్టీ బడా నేతల నివాసాలలో, ఫామ్ హౌస్లలో పోలీసుల కన్నుగప్పి ఎన్ని కోట్ల రూపాయలు ఇతర జిల్లాలకు రాష్ట్రాలకు తరలించారో అనే అనుమానాలను వ్యక్తమవుతున్నాయన్నారు.



రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రతి బిఆర్ఎస్ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, వారి బంధువులు, అనుచరులు, బినామీల ఇండ్లు, వ్యాపార సముదాయాలు, అనుమాదాస్పద, సౌకర్య కరమైనటువంటి ప్రాంతాలలో, భవనాలలో ఏకధాటిగా దాడులు, సోదాలు జరపాలని జిల్లా కాంగ్రెస్ పక్షాన రాష్ట్ర పోలీసు శాఖను కోరారు. అవినీతి సొమ్ముతో ప్రజలను, డబ్బు ఆశతో రాజకీయ నేతలను ప్రలోభ పెట్టడానికి అవకాశం లేకుండా పూర్తి శాంతియుత వాతావరణంలో రాబోయే ఎన్నికలు నిర్వహించే విధంగా పోలీసులు అన్ని రకాల చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎన్నికల బాండ్ల రూపంలో చాలా వ్యాపార సంస్థల నుండి వందల కోట్ల రూపాయల నిధులు సేకరించడం జరిగిందనే విషయాన్ని ఇటీవల దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వెల్లడించడం జరిగిందన్నారు. ఈ విధంగా అటు దేశంలో బిజెపి పార్టీ, ఇటు రాష్ట్రంలో టిఆర్ఎస్ పార్టీ అవినీతి సొమ్ముతో రాజకీయాలను శాసించాలనుకోవడాన్ని చూస్తుంటే రానున్న కాలంలో ఈ దేశంలో పూర్తిగా ధన బలంతో, రాజకీయ బలంతో తమ స్వార్థం కోసం తమ రాజకీయ ప్రయోజనాల కోసం దేశ ప్రజలను దేశ రాజ్యాంగ వ్యవస్థను తమ గుప్పిట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా ఈ రెండు రాజకీయ పార్టీలు వ్యూహాత్మక రాజకీయాలకు ప్రణాళిక చేస్తున్నారనే ఆలోచనలో భాగంగానే ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించవలసి వస్తుందని, ఇది విచారకరమని అన్నారు. ఈ విధమైన చర్యలను ప్రతి పౌరుడు ఖండించవలసిన సమయం ఆసన్నమైనదని, విజ్ఞులైన తెలంగాణ రాష్ట్ర ప్రజలు బిజెపి, బీఆర్ఎస్ పార్టీల ఎత్తుగడలను గమనించాలని, ఆ రెండు పార్టీలకు తగిన బుద్ధి చెప్పి ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పత్రికాముఖంగా విజ్ఞప్తి చేశారు.

# నామినేటెడ్ పోస్టులలో ఆర్యవైశ్యులకు ప్రాధాన్యత కల్పించాలి

**ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు నటరాజ్**

గోదావరిఖని, మార్చి 16 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులలో ఆర్యవైశ్యులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని ఆర్యవైశ్య సంఘం గోదావరిఖని పట్టణ అధ్యక్షులు వినిశెట్టి నటరాజశేఖర్ డిమాండ్ చేశారు. శనివారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు .ఇప్పటివరకు అన్ని రాజకీయ పార్టీలు ఆర్యవైశ్యులను మోసం చేశాయని, రాజకీయంగా అవకాశాలు కల్పించకుండా చిన్నచూపు చూశాయని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికలలో ఒకటి రెండు సీట్లు కేటాయించి చేతులు దులుపుకున్నాయన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ స్పందించి నామినేటెడ్ పోస్టులలో ప్రాధాన్యత ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని మంత్రి వర్గం నిర్ణయించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో పాటు మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో చేతులు దులుపు కోకుండా విధివిధానాలు రూపొందించాలని, చైర్మన్ ఏర్పాటు చేయాలని,కనీసం రూ.500 కోట్ల నుంచి రూ. 1000 కోట్ల నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు కనీసం రూ.3 కోట్లు కేటాయిస్తే పేద ఆర్యవైశ్యులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో గాంధీ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. విలేకరుల ఈ సమావేశంలో నాయకులు చిదురాల రవీందర్ ,చిటిమల్ల కిషోర్, తాటిపెల్లి వెంకన్న, శ్రీరాములు, యాద వెంకటరమణ ,నర్సయ్య ,అప్పల విలాస్ పాల్గొన్నారు.



# అవినీతి సొమ్ముతో దొరికిపోయిన బోయినిపల్లి వినోద్ కుమార్

**ప్రతిమా మల్టీప్లెక్స్ అనుమతులను రద్దుచేయాలి**
**జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి**

కరీంనగర్, మార్చి 16, (ప్రజాజ్యోతి): అవినీతి సొమ్ముతో బోయినిపల్లి వినోద్ కుమార్ అడ్డంగా దొరికిపోయారని అవినీతి సొమ్ముకు నిలయంగా మారిన ప్రతిమా మల్టీప్లెక్స్ అనుమతులను రద్దుచేసి ఆ హోటలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి అన్నారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కు చెందిన నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్ హోటల్లో పోలీసులు జరిపిన సుధాలో 6 కోట్ల 68 లక్షల అవినీతి సొమ్ము బయటపడిన విషయమై స్పందిస్తూ కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ అధ్యక్షులు పులి ఆంజనేయులు గౌడ్ శనివారం నగరంలోని ప్రెస్ భవన్లో పత్రిక విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ రాబోతుందని సమాచారంతోనే 9 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో ల్యాండ్ మాఫియా, మైనింగ్ మాఫియా, వైన్ మాఫియా తో అడ్డగోలుగా సంపాదించిన అవినీతి సొమ్మును టిఆర్ఎస్ నేత వినోద్ ప్రతిమ మల్టీప్లెక్స్ లో దాచిపెట్టడం జరిగిందని, పోలీసులు జరిపిన సుధాలో కట్టలు కట్టలుగా బయటపడిన అవినీతి సొమ్ముతో వినోద్ కుమార్ కరీంనగర్ ప్రజల ముందు దోషిగా నిలబడ్డారని, కెసిఆర్ కుటుంబం అవినీతి డిఎన్ఏ తో జీర్ణించుకుపోయిందని. అవినీతి సొమ్ముతో దొరికిపోయిన వినోద్ కుమార్ ఇప్పుడు ఏ ముఖం పెట్టుకొని కరీంనగర్ ప్రజలను ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మద్యం నగదు పంచి ఓట్లు దండుకోవాలనే దురుద్దేశంతోనే వినోద్ కుమార్ కోట్ల రూపాయలను దాచి పెట్టడం జరిగిందని, ఈ ఒక్క చోటే ఆరు కోట్ల రూపాయలు దొరికితే రాష్ట్రం మొత్తంలో టిఆర్ఎస్ పార్టీ నేతలకు సంబంధించిన వ్యాపార సంస్థల్లో సోదా చేస్తే ఎన్ని లక్షల కోట్ల రూపాయలు బయటపడతాయో తెలంగాణ ప్రజలు గుర్తించాలని సూచించారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అవినీతి కంపుతో నిండిపోయిన టిఆర్ఎస్ పార్టీని చిత్తుగా ఓడించిన రాష్ట్ర ప్రజలు రేపు రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో టిఆర్ఎస్ పార్టీని భూస్థాపితం చేసి ఆ పార్టీ అవినీతిపరులను ఈ రాష్ట్రం నుండి తరిమి కొట్టాలని అన్నారు. తెలంగాణ సమాజాన్ని కోరుతూ ఆర్టీసీ స్థలంలో నిర్మించబడిన అవినీతి సొమ్ముకు నిలయంగా మారిన ప్రతిమ మల్టీప్లెక్స్ హోటల్ అనుమతులను రద్దు చేసి, ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పత్రిక ముఖంగా డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు రహమత్ హుస్సేన్, నూనె గోపాల్ రెడ్డి, కంకణాల అనిల్ కుమార్, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ

సిరిసిల్ల టౌన్: మార్చి 16(ప్రజా జ్యోతి) ప్రధానమంత్రి ఉజ్వల పథకం ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన లబ్దిదారులకు సిరిసిల్ల పట్టణంలోని రాజరాజేశ్వర హెచ్.పి గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఉచిత గ్యాస్ కనెక్షన్లు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నాలింగాపూర్ ఎంపిటిసి బైరినేని రాము, రాజరాజేశ్వర గ్యాస్ ఏజెన్సీ డిలర్ భీమవరం రాధిక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ సెక్రటరీల నూతన కార్యవర్గం ఎన్నిక



కోనరావుపేట మార్చి 16 (ప్రజాజ్యోతి):రాజన్న సిరిసిల్లా జిల్లా కోనరావుపేట మండల పంచాయితీ సెక్రటరీల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. కార్యదర్శుల మండల అధ్యక్షుడిగా యం.డి అజీజ్,ఉప అధ్యక్షులుగా కె. కవిత, ట్రెసరర్ వేణు లను ఎన్నుకున్నట్లు మండల సెక్రటరీలు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి ఇంచార్జ్ ఎంపిడిఓ మీర్జా, శుభాకాంక్షలు తెలిపారు.

## కేటీఆర్ నియోజకవర్గంలో ఖాళీ అవుతున్న బిఆర్ఎస్

**బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసిన ముగ్గురు కౌన్సిలర్**



సిరిసిల్ల టౌన్: మార్చి 16(ప్రజా జ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు సిరిసిల్ల నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు నేరెళ్ల శైలజ, కుడిక్యాల రవి, వేముల రవి,తో పాటు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్ లు బిఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మేము మున్సిపల్ కౌన్సిలర్ ఎలక్షన్లో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి గెలిచామని అప్పుడున్న బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మీ వార్డ్ అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తామని హామీ ఇస్తే ఆ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. వార్డ్ అభివృద్ధి కోసం బిఆర్ఎస్ నాయకులను మంత్రి కేటీఆర్ ను ఎంతగానో అడిగిన పట్టించుకోలేదని పేర్కొన్నారు. దీని పై వార్డు ప్రజలు అసంతృప్తిగా ఉండడం వలన బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం జరిగిందని తెలిపారు.

## పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**బీజేపీ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి**

రాజన్న సిరిసిల్ల, మార్చి 16, (ప్రజాజ్యోతి): వీర్నపల్లి మండలంలోని వన్ పల్లి గ్రామంలో శనివారం ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వడగళ్ల వర్షం పడింది. దీంతో కోతకు వచ్చిన పంట నష్టం వాటిల్లింది. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల అఖరిలో కోతకు వచ్చే పంటలకు అకాల వర్షంతో నష్టము వాటిల్లిందని, పంట నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం గత ఏడాది ఇదే సమయములో వడ గళ్ళ వర్షము పడితే వ్యవసాయ అధికారులు సందర్శించారు తప్ప ఏ రైతును కూడా ఆదుకోలేదని గుర్తు చేశారు.

# ప్రైవేట్ వస్త్ర తయారీ ఆర్డర్ల సాధనకు కృషి చేయాలి

**ఆసక్తి గల ఆసాములకు సూరత్ లో శిక్షణ అందిస్తాం**

**సెప్టెంబర్ నాటికి పాత బకాయిలు చెల్లించేలా చర్యలు**

**ప్రైవేట్ వస్త్ర పరిశ్రమ మార్కెట్ ను నేతన్నలు అన్వేషించాలి**

**నేత కార్మికులకు అందాల్సిన సబ్సిడీలను సకాలంలో అందిస్తాం**

**చేనేత జౌళి శాఖ సంచాలకులు అళుగు వర్షిణి**





రాజన్న సిరిసిల్ల, మార్చి 16, (ప్రజాజ్యోతి): సిరిసిల్లలోని చేనేత కార్మికులు, ఆసాములు ప్రైవేట్ వస్త్ర పరిశ్రమ సంబంధించిన ఆర్డర్ల సాధన దిశగా కృషి చేయాలని , మార్కెట్ లో పోటి పడేందుకు అవసరమైన నైపుణ్య శిక్షణ, ఇతర సహాయ సహకారాలు అందించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని చేనేత జౌళి శాఖ సంచాలకులు అళుగు వర్షిణి అన్నారు. శనివారం చేనేత జౌళి శాఖ సంచాలకులు అళుగు వర్షిణి నేత కార్మికుల సమస్యల పరిష్కారం పై రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కలెక్టరేట్లోని మినీ సమావేశం మందిరంలో సంబంధిత కార్మిక సంఘాల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత జౌళి శాఖ సంచాలకులు అళుగు వర్షిణి మాట్లాడుతూ పరిశ్రమల మనుగడకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని, అదే సమయంలో పూర్తిస్థాయిలో ప్రభుత్వం పై ఆధారపడటం మంచిది కాదని, ప్రైవేటు రంగంలో గల అవకాశాలను సైతం అన్వేషించాలని సంచాలకులు తెలిపారు. ప్రభుత్వం ఉన్న అవకాశాల మేరకు మాత్రమే బట్ట తయారీ కోసం ఆర్డర్లు ఇవ్వగలుగుతుందని, త్వరలో సిరిసిల్లతో పాటు నారాయణపేట, చౌటుప్పల్ వంటి ప్రాంతాలలో సైతం చేనేత క్లస్టర్లు వస్తాయని, ప్రతి ఒక్కరికి ప్రభుత్వమే పని కల్పించే అవకాశం ఉండదని, ప్రైవేట్ రంగంలో గల అవకాశాలను వినియోగించుకోవాలని సంచాలకులు సూచించారు. ఆసక్తి గల ఆసాములకు , నేతన్నలు బృందంగా ఏర్పాటు చేసి సూరత్ లో వస్త్ర పరిశ్రమ పనితీరు పట్ల అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. తమిళనాడు సూరత్ వంటి ఇతర ప్రాంతాలో ఉన్న వస్త్ర పరిశ్రమల వద్ద నుంచి మన వద్ద అందుబాటులో ఉన్న టెక్నాలజీ ప్రకారం రూపొందించే బట్ట ఆర్డర్లు సాధించే ప్రయత్నం చేయాలని ఆమె సూచించారు. చేనేత రంగంలో వినియోగిస్తున్న ఆధునిక సాంకేతికత, ప్రింటింగ్ యూనిట్, ప్రాసెసింగ్ కట్టింగ్ యూనిట్స్ మొదలగు అంశాలను అవగాహన కల్పించుకుని సొంత పెట్టుబడితో వ్యాపారం ప్రారంభించాలనుకునే వారికి వసతి కల్పిస్తామని అన్నారు. చేనేత రంగంలో నూతన టెక్నాలజీని అలవర్చుకోవాలని, బ్యాంకు రుణాలు ద్వారా కొత్త యంత్రాల కొనుగోలుకు ప్రభుత్వం తరపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని, అనవసరపు ధర్నాలు పోరాటాలు చేయవద్దని, మనం తయారు చేసే వస్త్రంలో మంచి నాణ్యత ఉంటే అధిక ఆర్డర్లు వస్తాయని ఆమె పేర్కొన్నారు. ప్రభుత్వం నూలు పై అందించే సబ్సిడీని ఎప్పటికప్పుడు సకాలంలో విడుదల చేసేందుకు చర్యలు తీసుకుంటామని, అదేవిధంగా పాత బకాయిలను సైతం సెప్టెంబర్ నాటికి అందజేయడం జరుగుతుందని ఆమె అన్నారు. గత 7 సంవత్సరాల నుంచి బతుకమ్మ చీరలు, ప్రభుత్వ బట్టలకు సంబంధించిన ఆర్డర్లు అందిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో మార్పు రాలేదని, ప్రభుత్వం పైనే ఆధారపడకుండా బహిరంగ మార్కెట్ లో గల అవకాశాలను అంది పుచ్చుకోవాలని, ప్రైవేట్ రంగంలో నిలదొక్కుకునేందుకు నేత కార్మికులకు అవసరమైన సహాయ సహకారాలను ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. ప్రతి ఒక్క నేతన్న కార్మికుడు తప్పనిసరిగా టి నేతన్న యాప్ లో వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు.అనంతరం సిరిసిల్ల చేనేత కార్మిక సంఘం నాయకులు వారి డిమాండ్లను తెలియజేస్తూ మెమోరండం అందజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి.గౌతమి, నేత కార్మికులు, ఆసాములు , కార్మిక సంఘం నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవిత అరెస్టుకు నల్ల బ్యాడ్జీలతో నిరసన



మల్యాల, మార్చ్ 16 (ప్రజాజ్యోతి) : మల్యాల మండల కేంద్రంలోని బ్లాక్ చౌరస్తా వద్దగల అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం ఎమ్మెల్సీ కవిత అరెస్టును నిరసిస్తూ మండల బిఆర్ఎస్ శ్రేణులు నల్ల బ్యాడ్జిలు ధరించి నిరసన తెలియజేసారు. లోక్సభ ఎన్నికల ముందు కవిత అరెస్ట్ కావడం రాజకీయ కక్ష సాధింపే అని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్,బీజేపీ రెండు పార్టీలు కలిసే బీఆర్ఎస్‌ను దెబ్బతీయాలని చూస్తున్నాయని మండి పడుతున్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగం శ్రీనివాస్,మాజీ సర్పంచ్లు మిట్టపెల్లి సుదర్శన్,బద్దం తిరుపతి,నల్లాల బుచ్చన్న,ఉప సర్పంచ్ పోతరాజు శ్రీనివాస్, బిఆర్ఎస్ మల్యాల పట్టణ శాఖ అధ్యక్షుడు గడ్డం రాజేశ్వర్ రెడ్డి,వేణు రావు,జెఎస్ గౌడ్,గుడిసె రవి,చిన్న దుర్గయ్య, రాజబాబు,నరేష్ చందు,రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను సన్మానించిన పద్మశాలి యూత్ సంఘం సభ్యులు



రుద్రంగి మార్చి 16 ప్రజా జ్యోతి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో రుద్రంగి మండల కేంద్రంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ ను పద్మశాలి యూత్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఈ సభ్యులు మాట్లాడుతూ పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేయడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్షులు పిల్లమారపు ప్రవీణ్, పడాల గణేష్, మంచే రాజేశం, ఎలిగేటి ప్రదీప్, మ్యకల రాజేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ కార్పొరేషన్ మెంబర్ ను కలిసిన బిజెపి నాయకులు

గోదావరిఖని, మార్చి 16 (ప్రజా జ్యోతి) జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ మెంబర్ వడ్డేపల్లి రామచందర్ ను బిజెపి నాయకులు కలిశారు.జాతీయ షెడ్యూల్ కులాల కమిషన్ మెంబర్ గా నియమితులై ఢిల్లీలో ప్రమాణ స్వీకారం తర్వాత అధికార పర్యటనలో భాగంగా రామగుండం ఎన్టిపిసి వచ్చిన వడ్డేపల్లి రామచందర్ ను పార్టీ జిల్లా మాజీ కార్యదర్శులు జక్కుల నరహరి, మహవాది రామన్న, నాయకులు కొమ్మల స్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలపై వారితో చర్చించారు. పెద్దపల్లి జిల్లాలో ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని , ఎన్టిపిసి, ఆర్ ఎఫ్ సి ఎల్, సింగరేణి విభాగాలలో ఎస్సీ ఎస్టీ వాళ్లకు కాంట్రాక్ట్ విధానంలో ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ విషయంపై జాతీయ కమిషన్ సభ్యులు సానుకూలంగా స్పందించారని ,తప్పకుండా అమలు జరిగే విధంగా చూస్తామని హామీ ఇచ్చినట్లు వారు చెప్పారు.



## సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

**నిర్మాణ పనులను ప్రారంభించిన ఎంపీటీసీ షేక్ యష్మిన్ పాషా...**

కోనరావుపేట మార్చి16(ప్రజాజ్యోతి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామంలో ఎంపీటీసీ షేక్ యాస్మిన్ పాష శనివారం సీసీ రోడ్లు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా యాష్మీన్ పాషా మాట్లాడుతూ ఎన్ఆర్ఈజీఎస్ పది లక్షలు రూపాయలు నిధులతో గ్రామంలో సీసీ రోడ్లు నిర్మిస్తున్నామని తెలిపారు. గ్రామంలోని ప్రతి మట్టి రోడ్డును సిసి రోడ్డుగా మార్చి ప్రజలకు ఉపయోగపడేలా అందుబాటులోకి తేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ పాషా,జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి,గొట్టె రుక్మిణి, బైరగొని నందు గౌడ్, యువజన నాయకులు ధర్మపురి, శ్రీనివాస్, గ్రామ అధ్యక్షులు ఎక్కలదేవి శ్రీనివాస్, భైరగోని శ్రీనివాస్, అనిల్, బోడ్డు రాములు, తిక్కల పోచయ్య, దర్ర రవి, తిక్కల దేవేందర్, చొక్కల దెవయ్య, సయ్యద్, జాఫర్, జంగం సంజీవ్, చిలుకవ్వ, తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ

ముస్తాబాద్ మార్చి 16 (ప్రజాజ్యోతి) రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో మహిళా కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ నిర్మాణానికి ఎంపీ బండి సంజయ్ నిధులనుండి మూడు లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగింది. బిజెపి మండల అధ్యక్షుడు అంజా గౌడ్,కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వరి వెంకటేష్ అధ్యక్షతన మహిళా కమ్యూనిటీ సంఘం ఆధ్వర్యంలో ప్రహరీ గోడ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిలో భాగంగా మహిళా సంఘం కమ్యూనిటీ హాల్ ప్రహరీ గోడ నిర్మాణానికి అడిగిన వెంటనే ఎంపీ నిధుల నుండి నిధులు మంజూరు చేసిన బండి సంజయ్ కి వరి వెంకటేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గౌతమ్ రావు,ఎంపిటిసి బాలకిషన్,కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది గారి శ్రీనివాస్,బిజెపి నాయకులు గూడెం మాజీ సర్పంచ్ సరిత శ్రీనివాసరావు,నాంపల్లి, కనకయ్య,మామిళ్ల బిక్షపతి, కేశిగాని శంకర్,నాయకులు రాజమల్లయ్య,దుర్గయ్య, శ్రీనివాస్,పరుశరాములు, మహిళా సంఘ సభ్యులు భారతమ్మ,లీలవ్వ,శంకరవ్వ, లస్మవ్వ,లక్ష్మి,బాల నర్సవ్వ, ఎల్లవ్వ,సరోజన తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాదులోని బేగంపేట, రామంతా పూర్ పబ్లిక్ స్కూల్ లలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానం

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**
**ఒకటవ తరగతి(ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశం కొరకు గిరిజన విద్యార్థిని,విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి**
**మార్చి -19 లోపు కరీంనగర్ కలెక్టరేట్ లోని డిటిడిఓ కార్యాలయంలో దరఖాస్తు సమర్పించాలి**



పెద్దపల్లి ప్రతినిధి,(ప్రజా జ్యోతి), మార్చి– 16: 2024–25 విద్యా సంవత్సరానికి గాను హైదరాబాదులోని బేగంపేట, రామంతా పూర్ పబ్లిక్ స్కూల్లలో 1వ తరగతి(ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశం కొరకు జిల్లాలోని గిరిజన విద్యార్థినీ, విద్యార్థులు మార్చి 19 లోగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన గిరిజన విద్యార్థిని, విద్యార్థులకు మొత్తము (5) సీట్లు కేటాయించడం జరిగిందని, ఒకటవ తరగతిలో లంబాడిలకు మూడు, గోండు/నాయక్ పోడు వారికి ఒకటి, ఇతరులకు ఒకటి చొప్పున కేటాయించడం జరిగిందని తెలిపారు. అభ్యర్థి 2017 జూన్ 1 నుండి 2018 మే 31 మధ్యలో జన్మించి ఉండాలని, తల్లిదండ్రుల వార్షిక ఆదాయం అర్బన్ ప్రాంతంలో రెండు లక్షలు, రూరల్ ప్రాంతంలో ఒక లక్షా 50 వేలు ఉండాలని, ధృవీకరణ పత్రాలు ఆదాయం, కులం, బర్త్, స్టడీ సర్టిఫికెట్, పాస్ పోర్ట్ 2 సైజ్ ఫోటోలను జత చేసి పూర్తి చేసిన దరఖాస్తులను గెజిటెడ్ అధికారిచే అటేస్టడ్ చేసిన మార్చి 19 మధ్యాహ్నం 12 గంటల లోగా కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కార్యాలయంలో సమర్పించాలని, ఇతర వివరాలకు ఫోన్ నెంబరు 9652118867 నందు సంప్రదించాలని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ గజ్జెల కాంతం కే టిక్కెట్ ఇవ్వాలి



జమ్మికుంట, మార్చి16( ప్రజా జ్యోతి): జమ్మికుంట మండలంలోని విలాసాగర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం హుజూరాబాద్ నియోజకవర్గ ఇంచార్జీ రాచపల్లి సాగర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ అభ్యర్థిగా గజ్జెల కాంతం కే టిక్కెట్ ఇవ్వాలని కోరారు.తెలంగాణ రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలు గత ప్రభుత్వం చేసిన అణచివేతను గమనించే మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో యావత్తు మాదిగలు కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడి ప్రభుత్వం ఏర్పడుటలో ముఖ్య భూమిక పోషించారని అన్నారు..పెద్దపల్లి పార్లమెంట్ స్థానాన్ని ఎస్సీ లకు రిజర్వ్ చేసిన నాటి నుండి నేటి వరకు మాదిగలకు అన్యాయం జరుగుతూనే ఉందని, అన్ని రాజకీయ పార్టీలు ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కూడా ఒకే కుటుంబానికి అవకాశాలు కల్పిస్తూ వస్తుందని అన్నారు. ఇప్పుడు జరగ బోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి పార్లమెంట్ టిక్కెట్టు మాదిగ లకే ఇవ్వాలని అది కూడా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ఎన్నో ఉద్యమాలు చేసిన తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ చైర్మన్ గజ్జెల కాంతం కే ఇవ్వాలని రాచపల్లి సాగర్ అన్నారు..ఈ కార్యక్రమంలో నాయకులు రాచపల్లి నవీన్, చంద్రగిరి రజనీకాంత్, రాచపల్లి అజయ్, రాచపల్లి వంశీ, రాచపల్లి అశ్విన్, అంబాల అభిలాష్, మహేష్, గణేష్, తేజ, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి**
**7,728 విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు**
**జిల్లాలో 45 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు**
**విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా పరీక్షలు వ్రాయాలి**

పెద్దపల్లి ప్రతినిధి, (ప్రజా జ్యోతి), మార్చి –16: మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించు పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు, విద్యార్థులు ఒత్తిడి, ఆందోళనకు గురికాకుండా పరీక్షలు వ్రాయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదవ తరగతి పరీక్షలను షెడ్యూల్ ప్రకారం నిర్వహిస్తున్నామని, జిల్లాలో 7,728 మంది పరీక్షలు వ్రాస్తున్నారనీ, వారి కోసం 45 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసి విద్యార్థులు ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని, విద్యార్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన డ్యూయల్ డెస్క్ లను అందుబాటులో ఉంచామని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద అవకతవకలు జరగకుండా మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించేందుకు విద్యార్థులు,పరీక్ష డ్యూటీలలో పాల్గొనే సిబ్బంది మొబైల్ ఫోన్లు , ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్ లను తీసుకురావడానికి నిషేధించామని, పరీక్ష కేంద్రాల్లోకి ఇతరులు రాకుండా విధుల్లో పాల్గొనే సిబ్బందికి ఫోటో గుర్తింపు కార్డులు అందించామని , వాటిని తప్పనిసరిగా ధరించాలని అన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్ష రాయాలని,ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు,సైన్స్ పరీక్ష మినహాయించి ప్రతి పరీక్ష ఉదయం 9–30 గంటల నుంచి మధ్యాహ్నం 12–30 గంటల వరకు జరుగుతాయని, ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు పరీక్ష ఉదయం 9–30 గంటల నుండి మధ్యాహ్నం 12–50 గంటల వరకు జరుగుతుందని, సైన్స్ పరీక్ష ఉదయం 9:30 నుంచి 11 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు రవాణా కోసం ప్రత్యేక ఆర్టీసీ బస్సులు ఉదయం, మధ్యాహ్నం నడుపుతున్నట్లు తెలిపారు.పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు హాల్ టికెట్స్, పరీక్ష ప్యాడ్, పెన్, పెన్సిల్ , స్కేల్, షార్పనర్, ఎరేజర్, జామెట్రీ పరికరాలను మాత్రమే తీసుకొని రావాలని అన్నారు. పరీక్ష రాయడానికి ముందు ఓఎంఆర్ షీట్ లోని వివరాలను, పరీక్షా రాసే విద్యార్థినీ, విద్యార్థులు ఇన్విజిలేటర్ ధృవీకరించాలని, ప్రశ్నపత్రం జారీ అయిన వెంటనే, విద్యార్థులు తమ హాల్ టికెట్ నెంబర్ ను జారీచేయబడిన పశ్నా పత్రముపై విధిగా వ్రాయాలని, అభ్యర్థులు తప్పనిసరిగా ఓఎంఆర్ షీట్ లో మెయిన్ అన్సర్ షీట్ సీరియల్ నెంటర్ ను సంబంధిత గడిలో విధిగా వ్రాయాలని అన్నారు. ప్రధాన జవాబు పత్రంతో అదనపు సమాధాన పత్రం / పార్ట్–బి, గ్రాఫ్, మ్యాప్లను జత చెయాలని, దారంతో గట్టిగా కట్టాలని, పరీక్ష డ్యూటీలో ఉన్న సిబ్బంది, విద్యార్థులు పరీక్ష పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రం వదిలి వెళ్లడానికి అనుమతించబడరని, పరీక్ష సమయంలో, ఒక అభ్యర్థి కాపీయింగ్/మాస్ కాపియింగ్ చేస్తే నిబంధనల ప్రకారం ప్రకారం డిబార్ చేసి తదుపరి పరీక్షలకు అనుమతించబడరని జిల్లా విద్యాశాఖ అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## విద్యార్థులు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలి





**స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణ శ్రీ**
**ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలి**
**గ్రామపంచాయతీ ఒక రూమ్ కేటాయిస్తే పౌర పఠన మందిరం ఏర్పాటుకు చర్యలు**
**జూలపల్లి మండలం వెంకట్రావుపల్లిలో పౌర పఠన మందిరాలను ప్రారంభించిన అదనపు కలెక్టర్**

పెద్దపల్లి ప్రతినిధి,(ప్రజా జ్యోతి), మార్చి –16: విద్యార్థులు తమకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ తమ లక్ష్యాలను చేరుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ అన్నారు. శనివారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ జూలపల్లి మండలం వెంకట్రావుపల్లిలో పౌర పఠన మందిరాలను(లైబ్రరీల)ను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ మాట్లాడుతూ,జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో యువతీ యువకులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విధంగా ఇప్పటి వరకు 15 పౌర పఠన మందిరాలను ఏర్పాటు చేశామని తెలిపారు.గ్రామపంచాయతీ భవనంలో ఒక గది కేటాయిస్తే పౌర పఠన మందిరం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఒక్కొక్క పౌర పఠన మందిరానికి జిల్లా గ్రంథాలయ సంస్థ ద్వారా 40,000 విలువగల ఫర్నిచర్, 10 వేల రూపాయల విలువ గల పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకంలో అందజేస్తున్నామని అన్నారు. పౌరపఠన మందిరానికి ప్రతినెల పత్రికలకు కొనుగోలు నిమిత్తం 1000 రూపాయలు, 1000 రూపాయల గౌరవ వేతనము గ్రంథాలయ సంస్థ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. ఒక కుటుంబ జీవన విధానాన్ని విద్య మారుస్తుందని,కుటుంబంలో ఒక సభ్యుడు బాగా చదువుకొని మంచి స్థాయికి చేరుకుంటే, సమాజంలో చాలా మందికి స్ఫూర్తి అవుతాడని, తమ కుటుంబం సైతం విద్యపై శ్రద్ధ పెట్టిన కారణంగా మంచి స్థితిలో ఉందని తెలిపారు. పౌర పఠన మందిరాన్ని గ్రామంలోని నిరుద్యోగ యువతీ,యువకులు, విద్యార్థులు సంపూర్ణంగా వినియోగించుకోవాలని, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచుతామని, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో పౌర పఠన మందిరాన్ని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తో కలిసి స్థానిక సంస్థలు అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెడ్పిటిసి, సంబంధిత అధికారులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు తదితరులు, పాల్గొన్నారు.

## లోక్ సభ ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ప్రజావాణి కార్యక్రమం తాత్కాలికంగా రద్దు

**జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



పెద్దపల్లి ప్రతినిధి,(ప్రజా జ్యోతి), మార్చి –16: లోక్ సభ సాధారణ ఎన్నికల షెడ్యూల్ విడుదల అయినందున, ఎన్నికల విధుల్లో జిల్లా అధికారులు, సిబ్బంది నిమగ్నమైనందున ఎన్నికల ప్రక్రియ ముగిసేవరకు జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు నిర్వహణలో భాగంగా ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికముగా రద్దు చేయడం జరిగిందని, ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

## కేసుల పరిష్కారానికి లోకదాలత్ లను సద్వినియోగం చేసుకోవాలి

**మెజిస్ట్రేట్ అరుణ్ కుమార్**



మెట్ పల్లి ప్రతినిధి మార్చ్ 16 ( ప్రజా జ్యోతి) : సివిల్ మరియు క్రిమినల్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్ లను ఉపయోగించుకోవచ్చని మెట్ పల్లి మున్సిప్ మేజిస్ట్రేట్ నారం అరుణ్ కుమార్ అన్నారు. శనివారం పట్టణంలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టులో లోక్ అదాలత్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కక్షిదారులు పరస్పరం రాజీ చేసుకోవడం ఉత్తమం అన్నారు. అనంతరం క్రిమినల్ కేసులు 370, సివిల్ కేసు ఒకటి, బ్యాంకు కేసులు రెండు బిఎస్ఎన్ఎల్ కేసులు 15 లను ఆయన పరిష్కరించారు. మండల లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, ,ప్రధాన కార్యదర్శి తెడ్డు ఆనంద్, ఉపాధ్యక్షుడు ఒజ్జెల శ్రీనివాస్, లోక్ అదాలత్ సభ్యులు కోటగిరి వెంకటస్వామి, గడ్డం శంకర్ రెడ్డి, న్యాయవాదులు వెంకట నరసయ్య, సోమ భూమేశ్వర్, పసునూరి శ్రీనివాస్, హఫీజ్, జిల్లావెంకటేశ్వర్లు, భానుమూర్తి, స్రవంతి, శేఖర్, సుధాకర్, జగన్, నల్ల రాజేందర్, భూషణ్, రాజేందర్ ,అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్గం, రామగుండం పోలీస్ స్టేషన్, ఆకస్మిక తనిఖీ చేసిన సిపి



జ్యోతి నగర్,(ప్రజా జ్యోతి), మార్చి 16: అంతర్గం, రామగుండం పోలీస్ స్టేషన్ ను రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్ ఐపిఎస్., ఆకస్మిక తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్ ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలతో పాటు పోలీస్ స్టేషన్ లోని రిసెప్షన్ సెంటర్ సందర్శించి రికార్డులను, సిసి కెమెరాల పనితీరు ను పోలీస్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న పని తీరు పై, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఎలాంటి నేరాలు అధికంగా జరుగుతున్నాయనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.నేరాల నియంత్రణ కు తీసుకొంటున్న చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ... పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదులపై అధికారులు తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా అధికారులు విధులు నిర్వహించాలని బ్లూకోట్స్ టీమ్‌లు 24 గంటలపాటు పని చేస్తాయన్నారు. పెట్రోలింగ్ ముమ్మరం నిర్వహించాలని పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసిపి రమేష్, సీఐ అజయ్ బాబు , ఎస్ఐ లు వెంకట్ , సతీష్ తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.